APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్

# వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 42 | జూలై 04 శనివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## విధి నిర్వహణలో మానవత్వం.. భుజాన మోసి బాలిక ప్రాణం కాపాడిన వార్డెన్

పార్వతీపురంమన్యం పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ హేమ.. ఓ విద్యార్థిని పట్ల మానవత్వం చూపారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలికను భుజంపై ఎత్తుకుని సుమారు 6 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో వైద్యం అందేలా చేసి విద్యార్థిని ప్రాణాన్ని కాపాడారు. ఈ విషయమై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందిస్తూ.. వార్డెన్ హేమను అభినందించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమెపై ప్రశంసలు కురిపించారు. సేవాభావంతో పనిచేసే మీలాంటి అధికారులు.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని కొనియాడారు.

## అప్పులపై దుష్ప్రచారం.. మంత్రి జూపల్లికి హరీశ్‌రావు లేఖ..

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు.. మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ. 4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ. 1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు.

# పాకిస్తాన్ బెదిరింపుల వేళ.. కేంద్రం బిగ్ స్టెప్

భారత రక్షణ రంగ బలాన్ని,త్రివిధ దళాల పోరాట సన్నద్ధతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నేడు జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశంలో రూ. 52,000 కోట్ల అంచనా వ్యయంతో వివిధ కొనుగోలు ప్రతిపాదనలకు పరిపాలనా ఆమోదం (యాక్సెప్టెన్స్ ఆఫ్ నెససిటీ - AoN) లభించింది. ఆర్మీ, నౌకాదళం, వాయుసేన అవసరాల కోసం అత్యంత అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ఆమోదాల ద్వారా చేకూర్చనున్నారు. ముఖ్యంగా యాంటీ డ్రోన్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, క్షిపణి వ్యవస్థల వంటి అత్యాధునిక సదుపాయాలను సమకూర్చుకోవడంపై ఈ రక్షణ కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇది సరిహద్దు భద్రతను మరింత సురక్షితం చేయనుంది. అత్యాధునిక ఆయుధాలు.. ఆర్మీకి మరిన్ని అత్యాధునిక ఆయుధాలను సమకూర్చనున్నారు. శత్రువుల ఆధునిక డ్రోన్ల నిఘాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు 'ఆకాశ్ తరంగ్' యాంటీ-యూఏవీ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్‌ను సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు. సాయుధ వాహనాల ముప్పును తిప్పికొట్టడానికి పదాతి దళ సామర్థ్యాన్ని పెంపొందించే 'మ్యాన్ పోర్టబుల్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్' వ్యవస్థలు సహాయపడతాయి. వైమానిక ముప్పుల నుంచి రక్షణ కల్పించేందుకు సహాయపడే మీడియం రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైల్ (MRSAM) ఆయుధ వ్యవస్థకు కూడా ఆమోదం లభించింది. సైన్యం ఉపయోగించే అత్యాధునిక యుద్ధ ట్యాంకుల ప్రాణనష్టాన్ని నివారించడానికి, వాటి మనుగడను పెంచడానికి 'యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్' సిస్టమ్ కొనుగోళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యంత సున్నిత, సంక్లిష్ట వాతావరణంలో పనిచేసే మల్టీ స్పెక్ట్రల్ సెన్సింగ్ కలిగిన వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ రక్షణ కవచంలా పని చేస్తుంది. తక్కువ ఖర్చుతో, అధిక వినాశకర శక్తి ఉన్న జెట్ ఆధారిత కమికాజే డ్రోన్ వ్యవస్థను కూడా సైన్యం సొంతం చేసుకోనుంది. నేవీ, వైమానిక దళాలకు ప్రాధాన్యం నేవీని బలోపేతం కోసం రక్షణ కొనుగోళ్ల మండలి కీలక కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శత్రు నౌకల కదలికలను నిరోధించేందుకు మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్ ఆర్మీ అమ్ములపొదిలో చేరనుంది.



సముద్ర జలాల్లో నిరంతర నిఘా కోసం నావల్ షిప్‌బోర్న్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ ఉపయోగపడుతుంది. నౌకల ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ మోటార్లను సురక్షితంగా పరీక్షించడానికి ల్యాండ్ బేస్డ్ టెస్టింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. వైమానిక దళానికి కీలకమైన 'ఫిక్స్డ్ వింగ్ బేస్డ్ హై ఆల్టిట్యూడ్ స్యూడో శాటిలైట్' కొనుగోలుకు డీఏసీ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఎయిర్‌ఫోర్స్ సుదూర ప్రాంతాలలో నిరంతర పర్యవేక్షణ, శత్రు గూఢచర్యాన్ని పసిగట్టే సమాచారం సేకరించడం, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ, రిమోట్ సెన్సింగ్‌ను సమర్థవంతంగా చేపట్టగలదు. మొత్తంగా త్రివిధ దళాల సమగ్ర రక్షణ అవసరాలను తీరుస్తూ స్వదేశీ రక్షణ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఈ కొనుగోళ్ల ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ సరికొత్త ఆయుధ సంపత్తి రక్షణ బలగాల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో దేశీయ రక్షణ రంగాన్ని స్వావలంబన దిశగా నడిపించడంలో కూడా దోహదపడతాయని భావిస్తున్నారు.

# అమరావతిపై కోర్టుకు..! సాయిరెడ్డి మరో సంచలనం..!

ఏపీ రాజధాని అమరావతి స్థానంలో మావిగన్ ను ప్రతిపాదిస్తూ, వచ్చే ఎన్నికల్లో ఈ రెండింటి మధ్య పోరాటమే అజెండాగా మారుస్తామని వైఎస్ జగన్ తాజాగా చేసిన ప్రకటనపై వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. అటు చంద్రబాబు అమరావతిని, ఇటు జగన్ మావిగన్ ప్లాన్ ను విమర్శిస్తూ సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా అమరావతిపై కోర్టును ఆశ్రయించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమే అని టీడీపీ, కాదు మావిగన్ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండూ చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తరవాత, బాధ్యత గల ఒక పౌరుడిగా తన అభిప్రాయాలు ప్రజలతో పంచుకుంటున్నాని సాయిరెడ్డి ట్వీట్ చేశారు. ఇందులో రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలి అన్న అంశం మీద శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని చంద్రబాబును ప్రశ్నించారు. అలాగే 2014లో రాష్ట్ర విభజన జరిగిందని, పన్నెండేళ్ళ తరవాత కూడా ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలన్న చర్చ నడుస్తోందంటే ఇది అందరూ సిగ్గు పడాల్సిన విషయం కాదా? అని ప్రశ్నించారు. ప్రక్షాళన వేళ సాయిరెడ్డి రిక్వెస్ట్..! రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తరవాత 2029లో మరో జనరల్ ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా? రాజధాని పేరుమీద జరుగుతున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అని నిలదీశారు. మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు అప్పగించకపోవటాన్ని, కేటాయింపులే చేయకపోవటాన్ని ఎలా సమర్థించుకుంటారన్నారు. క్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని అడిగారు. వియవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి అనే వి జి టి ఎం కాన్సెప్ట్ విభజన చట్టంలోనే ఉంది కదా? ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందన్నారు. =వఞశీఎఎవఅనవఎ ఖీశీతీ-శీబ జగన్ 'మావిగన్' సవాల్ వెనుక 15-29 సమీకరణం? ఏంటీ లెక్క ? అసలు అంశం రాజధాని నిర్మాణం పేరుమీద జరుగుతున్న అవినీతి. ఇందుకోసం ఏకంగా రూ. 50 వేల కోట్లు ఇప్పటి ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, ప్రతీ నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని,దీని అర్థం... భారీగా అవినీతికి వేస్తున్న పథకానికి అమరావతి అని అందమైన పేరు పెట్టారన్నారు. ఇది దేవతల రాజధాని అని కూడా బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకునేందుకు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటున్నారన్నారు. అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి... ఇప్పుడు బిల్డింగులు కడుతున్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఆ అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న



క్షేత్రం అయితే ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రమన్నారు. బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25-30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు,మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాల్సింది ఈ అవినీతిని అన్నారు. అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకమన్నారు. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? అని జగన్ ను ప్రశ్నించారు. మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమీషన్లు కొట్టాలి అన్నది కాదు కదా అని ప్రశ్నించారు. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని సాయిరెడ్డి ప్రకటించారు.

# టెహ్రాన్‌కు ఖమేనీ శవపేటిక.. వారంపాటు అంత్యక్రియలు..

## కొడుకు మొజ్తబా గైర్హాజరు..

అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు రాజధాని టెహ్రాన్‌లో అత్యంత ఘనంగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య కొనసాగుతున్నాయి. ఖమేనీ భౌతికకాయాన్ని ప్రత్యేక కాన్వాయ్‌లో టెహ్రాన్‌కు తీసుకురాగా తమ ప్రియతమ నేతను చివరి చూపు చూసేందుకు లక్షలాది మంది ప్రజలు, మతపెద్దలు, అభిమానులు తరలివచ్చారు. ఖమేనీ శవపేటికను చూసి అక్కడికి చేరిన జనసందోహం భావోద్వేగానికి లోనై రోదించడం అక్కడి విషాదకర పరిస్థితికి అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించిన ఇరాన్ ప్రభుత్వం, అంత్యక్రియలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మొజ్తబా గైర్హాజరుపై తీవ్ర చర్చ ఈ అంత్యక్రియల వేడుకల్లో అందరి దృష్టిని ఆకర్షించిన, తీవ్ర చర్చకు దారితీసిన అంశం ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ గైర్హాజరు కావడం. ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరిన నేపథ్యంలో మొజ్తబా భద్రతపై ఇరాన్ నిఘా వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో ఆయన బహిరంగంగా ప్రజల ముందుకు రావడం అత్యంత ప్రమాదకరమని భద్రతా నిపుణులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ కారణం చేతనే ఆయన అంత్యక్రియలకు దూరంగా ఉండాలనే కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. భారత్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధిగా ఉన్న అయాతొల్లా హకీమ్ ఎలాహి కూడా ఈ భద్రతా కారణాలను ధృవీకరించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దేశవ్యాప్తంగా నివాళుల వెల్లువ ఖమేనీ మరణంతో ఇరాన్ అంతటా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. టెహ్రాన్, ఖోమ్, మషాద్ వంటి ప్రధాన నగరాలతో పాటు పక్క దేశమైన ఇరాక్‌లోని పలు ప్రాంతాల్లోనూ ఆయనకు నివాళులర్పిస్తూ భారీ ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలు, మతపరమైన వ్యవస్థను ఏకఛత్రాధిపత్యంతో నడిపించిన నాయకుడిగా ఖమేనీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ఆయన హఠాన్మరణం ఇరాన్ అంతర్గత రాజకీయ భవిష్యత్తుపై పశ్చిమాసియా భౌగోళిక పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా విశ్లేషణలు మొదలయ్యాయి. భారత్ నుంచి సంఘీభావం.. టెహ్రాన్‌కు సల్మాన్ ఖుర్షీద్ ఈ చారిత్రాత్మక, సంక్షోభ ఘట్టంలో ఇరాన్‌కు సంఘీభావం ప్రకటించేందుకు భారత్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ టెహ్రాన్‌కు వెళ్లారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున



ఖర్గే రాసిన అధికారిక సంతాప లేఖను ఆయన ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులకు అందజేయనున్నారు. "కష్టకాలంలో ఉన్న చిరకాల మిత్రదేశానికి మద్దతుగా నిలవడం భారత్ బాధ్యత. గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ఇరాన్ ఎంతో మద్దతుగా నిలిచింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ద్వారా భారత నౌకల రాకపోకలకు ఇరాన్ అందించిన సహకారం మరువలేనిది." అని కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాలు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో ఖమేనీ అంత్యక్రియలు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రపంచంలోని పలు దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరవుతుండటంతో టెహ్రాన్ అంతటా హై-అలర్ట్ ప్రకటించారు. ఇరాన్‌లో రాబోయే రోజుల్లో కొత్త రాజకీయ పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి, ప్రాంతీయ భద్రతా పరిస్థితులు ఏ విధంగా మారబోతున్నాయన్న అంశాలపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి.

# మొన్ననే వార్నింగ్.. నేడు యాక్షన్‌లోకి..

## డిప్యూటీ సీఎం సూపర్ స్పీడ్..



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ భేటీ అయ్యారు. శుక్రవారం మంగళగిరిలోని పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి.. సైబర్ క్రైమ్ వార్షిక నివేదిక అందజేశారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగానికి పాల్పడే వారిపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. మరోవైపు సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తానని పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా దుర్వినియోగం.. ఇటీవలే ఈ అంశం గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ . సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కులని.. అయితే వాటికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయంటూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇదే క్రమంలోనే సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా ఉంటామని ప్రకటించారు. అలాంటివారు ఫిర్యాదు చేసేందుకు వీలుగా డిప్యూటీ సీఎంవోలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని కూడా పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ క్రమంలోనే శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ శుక్రవారం రోజున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ను కలిసి.. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ టీమ్ తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను ఈ వార్షిక నివేదికలో వివరించారు. అలాగే సోషల్ మీడియా వేధింపులు, ట్రోలింగ్ అంశాలతో పాటు మహిళలను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టే వ్యక్తులపై.. సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను పవన్ కళ్యాణ్‌కు వివరించారు. మరోవైపు ఏపీ సైబర్ క్రైమ్ విభాగం ద్వారా సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అలాగే తప్పుడు ప్రచారాలు, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించే శక్తులను సైతం అణిచి వేయాలని ఆలోచిస్తున్నారు. వీటితో పాటుగా సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా బాధితులుగా మారిన వారికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాజాగా సైబర్ క్రైమ్ ఐజీతో పవన్ కళ్యాణ్ భేటీ కావటంతో.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ దిశగా అడుగులు పడుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చడీ చప్పుడు లేకుండా.. పవన్ కళ్యాణ్ తిరుమల టూర్!



పవన్ కళ్యాణ్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే తిరుమలలో ప్రత్యక్ష మ య్యారు. తిరుమల అధికారులకు కూడా ఆయన ఆలయానికి వచ్చే గంట ముందు మాత్రమే సమాచారం అందినట్టు చెబుతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ఎక్కడికి వెళ్లినా అధికారికంగా ముందస్తు ప్రకటన విడుదల చేస్తారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా మీడియాకు ఇస్తారు. ప్రొటోకాల్‌లో భాగంగా డిప్యూటీ సీఎం హోదాలో ఆయనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందిస్తారు. గత నెలలో తెలంగాణలో పర్యటించినప్పుడు.. అదేవిధంగా ఢిల్లీలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసుకున్నప్పుడుకూడా మీడియాకు, ప్రజలకు కూడా సమాచారం ఇచ్చారు. తాజాగా పవన్ కళ్యాణ్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే తిరుమలలో ప్రత్యక్షమయ్యారు. తిరుమల అధికారులకు కూడా ఆయన ఆలయానికి వచ్చే గంట ముందు మాత్రమే సమాచారం అందినట్టు చెబుతున్నారు. దీంతో హడావుడిగానే ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం అనూహ్యంగా తిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ ధ్వజస్తంభానికి మొక్కుకుని... నేరుగా శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఈ పర్యటనలో కేవలం ఆయన మాత్రమే ఉన్నారు. ఇదే రోజు ఏపీ మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేష్ కూడా శ్రీవారిని దర్శించుకోవడం గమనార్హం. అయితే.. లోకేష్ పర్యటన వివరాలను.. ముందుగానే వెల్లడించినా.. పవన్ కళ్యాణ్ టూర్ విషయాన్ని మాత్రం అధికారులు చెప్పకపోవడం గమనార్హం. ఇటీవల తన ఆరోగ్యం బాగోకపోవడంతో మొక్కులు చెల్లించుకు నేందుకు తిరుమలకు వెళ్లి ఉంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు. దాదాపు ఏడాది తర్వాత పవన్ కళ్యాణ్ తిరుమలలో పర్యటించడం గమనార్హం. 2025 ప్రారంభంలో తిరుమల లడ్డూ వివాదం వచ్చినప్పుడు ఆయన సనాతన ధర్మ దీక్ష చేపట్టారు. ఆ సమయంలో దీక్షలోనే తిరుమలకు వెళ్లిన ఆయన.. అక్కడే విరమణ చేశారు. సనాతన ధర్మ దీక్ష పేరుతో తిరుపతిలో సభ కూడా నిర్వహించారు. ఆ తర్వాత.. మళ్లీ ఇప్పుడే తిరుమలలో పనవ్ కళ్యాణ్ పర్యటించడం గమనార్హం.

# ప్లాస్టిక్ వద్దు - మట్టే ముద్దు

ప్లాస్టిక్ మహమ్మారి మన నిత్యజీవితంలో సర్వసాధారణమైపోయింది. ఉదయం పాల ప్యాకెట్‌తో మొదలయ్యే మన దినచర్యలో ప్రథమస్థానం ప్లాస్టిక్‌దే. కిరాణా సరుకులు, షాంపు ప్యాకెట్స్, క్యారీ బ్యాగ్స్ ఇలా ఒకటేమిటి ప్రతీదీ కూడా ప్లాస్టిక్‌లోనే వినియోగిస్తున్నాము. ఈ ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకారి అని తెలిసినా కూడా దీని వినియోగం ఏ మాత్రం తగ్గడం లేదు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా పేపరు ప్లేట్సు, గ్లాసులు, గుడ్డ సంచులు వాడాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా పూర్తిగా మాత్రం అమలు కావడం లేదు. తమిళనాడులో రాజగోపాలన్ వాసుదేవన్ అనే ప్రొఫెసర్ ప్లాస్టిక్ వ్యర్థాలతో లక్ష కిలోమీటర్ల మేర స్థిరమైన రోడ్ నిర్మించే ప్రతిపాదన తీసుకువచ్చి దాన్ని అమలు పరిచే విధంగా కృషి చేసి అటు ఎన్విరాన్‌మెంటల్ హీరోగా ప్రజల ప్రశంసలను అందుకోవడమే కాకుండా ఇటు పద్మశ్రీ అవార్డును కూడా అందుకున్నారు. మధురై త్యాగరాయనగర్ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా వర్క్ చేస్తున్న రాజగోపాలన్ వాసుదేవన్ తమిళ ప్రజలందరూ ఇండియా ప్లాస్టిక్ మేన్‌గా పిలుచుకుంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి వాసుదేవన్ వేయించి రోడ్డు వర్షాలకు తట్టుకుని దీర్ఘకాలం నిలుస్తాయని, దీనివలన వృధా ఖర్చు తగ్గుతుందని ఆయన తెలియజేసారు. తమిళనాడులోని మధురైని మిగిలిన రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుని ఇదే విధంగా ప్లాస్టిక్ రోడ్లను నిర్మిస్తే బావుతుంటుంది కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఒక ప్రక్క ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూనే మరో ప్రక్క ప్రస్తుతం వున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో ఈ విధంగా రోడ్ల నిర్మాణం చేసే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. దానివలన కాలుష్యం తగ్గి స్వచ్ఛమైన గాలి, నీరు ప్రజలకు దొరుకుతాయి. ప్లాస్టిక్ నిర్మూలిస్తాం, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ స్లోగన్ వ్రాయడం కాదు అది అమలు పరిచేందుకు తగిన కృషి ప్రభుత్వం చేయాలి. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రలకు స్థానం కల్పించి మట్టి పాత్రలు తయారు చేసే వారిని ప్రోత్సహిస్తూ వారు తయారు చేసిన పాత్రలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పిస్తూ వారిని ఉత్తేజితులను చేయాలి. ప్రజలు కూడా మట్టిపాత్రల ఆవశ్యకతను గుర్తించేలా వారిని జాగృతి పరచాలి. మట్టిపాత్రల వాడకం చిన్నతనమని భావించే ప్రజల మనోభావాలలో మార్పు రావాలి. ప్లాస్టిక్ పాత్రలు ప్రాణాంతకమని, మట్టిపాత్రలు మహద్భాగ్యమనే నిజాన్ని వారు గుర్తించాలి. ఆ విధంగా ప్రజలలో మార్పు తెచ్చేందుకు ప్రజలను మీడియా ద్వారా, పత్రికల ద్వారా వారిలో మార్పు తీసుకురావాలి. మన పూర్వీకులు మట్టిపాత్రలనే విరివిగా ఉపయోగించేవారు అందువలననే వారు ఆరోగ్యంగా ఉండేవారనే విషయాన్ని నేటి తరం వారు గ్రహిస్తే మంచిది.



- గొర్రెల సత్యవతి, సెల్: 9492387819

# వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి ..

**ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలి : కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



కాకినాడ సిటీ జూలై 3 జి ఎస్ బి వార్త : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించాలని కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సూచించారు. శుక్రవారం కాకినాడ నగరంలోని 33వ డివిజన్ కామేశ్వరి నగర్ ప్రాంతంలో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. పారిశుధ్య పరిస్థితులు, డ్రైనేజీ నిర్వహణ, తాగునీటి సరఫరా, దోమల నివారణ చర్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. డ్రోన్లతో దోమల నివారణ మందుల స్ప్రే.?ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడిన కమిషనర్.. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టేందుకు కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా డ్రోన్ సాంకేతికతను వినియోగించి దోమల నివారణ మందులను స్ప్రే చేస్తున్నామని, అవసరమైన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.?ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చు. ఎవరికైనా జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడంతో పాటు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించాలి. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, కార్పొరేషన్ చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, వాటర్ వర్క్స్ డిప్యూటీ ఇంజనీర్ లక్ష్మీనారాయణ తదితర అధికారులు కమిషనర్ వెంట పాల్గొన్నారు

# పార్టీ మారిన ఇద్దరు వైసీపీ నాయకులు

అనపర్తి జూన్ 3 (జి ఎస్ బి వార్త ) మండలంలో రామవరం గ్రామానికి చెందిన ఇద్దరు వైసిపి నాయకులు ఒకరు టిడిపి,ఒకరు బిజెపిలోకి చేరారు. రామవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సబ్బెళ్ళ అమ్మిరెడ్డి కి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే రామవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సొసైటీ మాజీ మెంబర్ గొలుగూరి వెంకటరమణ రెడ్డి కి యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుతుకులూరు, రామవరం గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 125 రోజుల ఉపాధి హామీ పథకం గోకవరంలో ఘన శ్రీకారం

**మండల బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం**



గోకవరం: జులై 3 జి ఎస్ బి వార్త : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు చేపట్టిన నేపథ్యంలో, 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచడంతో పాటు కూలీ రేట్లను కూడా పెంచి నూతన ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించి అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో మండల శాఖ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకాన్ని ఘనంగా ప్రారంభించారు .మండల కేంద్రంలోని గుర్రాలవారి చెరువు సమీపంలో గోకవరం మండల బీజేపీ అధ్యక్షుడు ఇనకోటి బాపనదొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గౌడ కార్పొరేషన్ చైర్మన్ మట్ట మంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ నాయకుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్ట మంగరాజు, ఇనకోటి బాపనదొర, సత్తి వెంకటరెడ్డి లు మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా జన్ గ్రామీణ్ మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంలో ఉపాధి దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు కూలీ వేతనాలను కూడా పెంచడం జరిగిందన్నారు ఉపాధి శ్రమికుల వేతనం 15 రోజుల్లోనే వారికి అందించే విధంగా రూపొందించిందని పేర్కొన్నారు ఈ పథకం గ్రామీణ పేదలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చెరువుల అభివృద్ధి, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి పనులకు ఈ పథకం ద్వారా అధిక ప్రాధాన్యం కల్పించవచ్చని వారు తెలిపారు. గ్రామీణ పేదల జీవనోపాధి మెరుగుపర్చడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులుకర్రి శివ ,టిడిపి సీనియర్ లాజర్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, ఉపాధి శ్రమికులు తదితరులు పాల్గొన్నారు....

# "కంబాల" ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మి గణపతి హోమం..



గోకవరం జులై 3 జి ఎస్ బి వార్త : సంకష్టహర చతుర్థి పర్వదినం సందర్భంగా స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గారు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులచే అర్చకులు గణపతి హోమాన్ని, శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖ, సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఏటా పాడి పంటలు బాగా పండాలని, అన్నదాతలు, వ్యాపారస్తులు, కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల వారు, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో ప్రతి నెల లోక కళ్యాణార్థం లక్ష్మి గణపతి హోమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కంబాల శ్రీనివాసరావు గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగు నీళ్లు అందించాలి

**ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీయరా.?**
**దేవారం,శరభవరం గ్రామపంచాయతీల రైతులకు సాగునీరు అందించరా.?**
**ఏపీ ఆదివాసీ జేఏసీ సూటి ప్రశ్న**



దేవీపట్నం జూలై 3 జి ఎస్ బి వార్త : ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీసి మరియు చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు ఏర్పాటుచేసి సాగునీరు అందించరా..? అని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ...ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుంది.కానీ రైతులకు సాగునీరు అందించడంలోను మరియు అభివృద్ధి సంక్షేమం విషయంలోను క్షేత్ర స్థాయిలో పూర్తిగా విఫలమైందన్నారు.ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీయడానికి 70 లక్షలు రూపాయలు మంజూరు చేసిందన్నారు.కానీ ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువ చివరి వరకు పూడికతీత పనులు పూర్తిగా కాకపోవడంతో దేవారం,శరభ వరం గ్రామపంచాయతీల రైతులకు సాగునీరు అందని ద్రాక్ష మారిందన్నారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ తొలకరి నాటికే చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు ఏర్పాటు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులతో పక్కాగా ప్రణాళికలు రూపొందించారు..కానీ నేటికీ చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు నిర్మించలేదన్నారు.మరోవైపు అధికారులు ప్రజా ప్రతినిధులు చెబుతున్న అభివృద్ధి మాటల్లోనే ఉంది కానీ క్షేత్ర స్థాయిలో లేదని విమర్శించారు.ఈ సంవత్సరం కూడా రైతుల పంట భూములకు సాగునీరు అందించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సిరి ధాన్యాలు కందులు,మినుములు,పెసర్లు,బొబ్బరులు,చోళ్ళు,గంటెలు,సామలు,జొన్నలు మొదలైనవి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే సంబంధిత శాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడికతీత పనులు మరల తిరిగి ప్రారంభించాలని మరియు చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,భారత్ ఆదివాసీ పార్టీ స్టీరింగ్ కమిటీ జిల్లా ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్ మొదలైన వారు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును అమల్లోకి తీసుకురావాలి

**అనపర్తి బార్ అసోసియేషన్ తీర్మానం**



అనపర్తి జూన్ 3 ( జి ఎస్ బి వార్త ) : అనపర్తి బార్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ గురువారం జరిగింది . ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును ప్రవేశపెట్టి , సత్వరమే అమల్లోకి తీసుకు రావాలని తీర్మానం చేయడం జరిగింది . ఇప్పటికే రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లో ఉంది అని న్యాయవాదుల పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ను పలుచోట్ల న్యాయవాదులు పై దాడులు జరుగుతూనే ఉన్నాయి .ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు , ఆయా బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేయడం తప్పా, న్యాయవాదులకు సరైన భద్రత అందడం లేదని న్యాయవాదులు అన్నారు . ఇలా ఆంధ్రప్రదేశ్ లో జరిగే దాడులు అన్ని "న్యాయవాది వృత్తి" పై జరుగుతున్న దాడులే అన్నారు . ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు, పోలీస్ స్టేషన్లో కూడ న్యాయవాదులకు సరైన గౌరవం ఇవ్వడం లేదని తెలిపారు . అడ్వకేట్ యాక్ట్ 1961 సెక్షన్ 24 ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో సుమారుగా 60 వేలు మంది న్యాయవాది వృత్తి లో ఉన్నట్లు, మన దేశంలో సుమారు 15 లక్షలు మంది న్యాయవాదులు ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. మన రాష్ట్రంలో ముందుగా అనపర్తి గౌరవ న్యాయవాదులు అందరూ ఐక్యత తో న్యాయవాదుల రక్షణ చట్టం కోసం .." నిర్మాణం – ఒక రోజు నిరాహారదీక్ష " కోసం జులై 7న మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4.30 వరకు ఒక రోజు నిరాహారదీక్ష అనపర్తి కోర్టు ప్రాంగణం బయట ఉంటుందని అందులో న్యాయవాదులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న సుమారుగా 154 బార్ అసోసియేషన్ల లో ఉన్న న్యాయవాది మిత్రులు అందరూ ఐక్యతగా చైతన్యం కావాలని అన్నారు . ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అనపర్తి బార్ అసోసియేషన్ తరపున "ఒక మెమోరాండం " అందచేయనున్నట్లు చెప్పారు. అనపర్తి బార్ అసోసియేషన్ ఐక్యత గా ఒకరోజు నిరాహారదీక్ష లో పాల్గొననునట్లు అనపర్తి బార్ అసోసియేషన్ కార్యదర్శి టీవీవి రమణ మూర్తి మీడియా కు వివరించారు.

# పులుగుర్త పాఠశాలకు కుర్చీలు బహూకరణ



అనపర్తి జూన్ 3 (జి ఎస్ బి వార్త ) : మండలంలో పులుగుర్త ఆర్ఐవిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 6500 రూపాయలు విలువచేసే కుర్చీలను పాఠశాల అవసర నిమిత్తం విశ్రాంత ప్రధానోపాధ్యాయిణి కాటూరు సీతామాలక్ష్మి పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు టి.వి సురేంద్రకు అందజేస్తారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ సీతామహాలక్ష్మి గతంలో పాఠశాలకు సుమారు 25 వేల రూపాయలు విలువ చేసే వస్తువులను ఇచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, జయశ్రీ, వరలక్ష్మి, దుర్గాప్రసాద్, సుధాకర్, రత్న కుమార్ లు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సౌజన్యంతో విగ్రహాల ఏర్పాటు



అనపర్తి జూన్ 3 ( జి ఎస్ బి వార్త) : స్థానిక శ్రీరామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్ 10 వ తరగతి పూర్వ విద్యార్థుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సరస్వతి దేవి విగ్రహాలను శుక్రవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కూటమి నాయకులు ఆవిష్కరించారు. సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి రెండేళ్లలో పాఠశాలల రూపు రేఖలు మార్చారని తెలిపారు. బిఫోర్ విధానంలో దాతలు ముందుకు రావాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అనపర్తి పూర్వ విద్యార్థులు పాఠశాలలో విగ్రహాల ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అనపర్తి మండలం,టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

# బాలికల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

**కోరుకొండ పోలీస్ సిఐ**




గోకవరం జులై 3 జి ఎస్ బి వార్త : కోరుకొండ సర్కిల్, గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికల మిస్సింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని కోరుకొండ సీఐ మూర్తి శుక్రవారం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ చదువుతున్న బాలికలపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని తెలిపారు. సోషల్ మీడియాలో అమ్మాయిలకు మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో మోసం చేయడంతో పాటు కిడ్నాప్ చేస్తున్నారు. తల్లిదండ్రుల అప్రమత్తంగా ఉండాలన్నారు.

RNI AP BIL14872/2024
గోదావరి భవిష్యత్ వార్త గోదావరి స్పెషల్ బులిటెన్ తెలుగు దినపత్రిక
04-07-2026

## సేవా కార్యక్రమాల ద్వారా "మెకానిక్ డే" వేడుకలు...




సామర్లకోట, జూలై 3, జి ఎస్ బి వార్త : టూవీలర్ సృష్టికర్త "గాట్లిబ్ డైమ్లార్" జయంతి పురస్కరించుకుని సామర్లకోట పట్టణంలో శ్రీ లక్ష్మీ గణపతి స్కూటర్ మరియు మోటర్ సైకిల్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "మెకానిక్ డే" వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తూరపాటి లక్ష్మణరావు, జామి శ్రీనువాస్ ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం శాంతి వర్ధన్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మెకానిక్ సోదరులు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెకానిక్ యూనియన్ అధ్యక్షులు తూరపాటి లక్ష్మణరావు మాట్లాడుతూ మెకానిక్ సోదరులు సంఘటితంగా కలిసి ఉండాలని,తద్వారా తమ సమస్యలు పరిష్కారానికి దోహద పడుతుదన్నారు. అంతకుముందు సామర్లకోటలో ట్రాపిక్ ఎస్ఐ అడపా గరగా రావు, సీనియర్ మెకానిక్ లు నీలం మూర్తి, సేవా సత్య నారాయణలను మెకానిక్ యూనియన్ నాయకులు దుస్సాలువా, పూల దండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పరపల్లి సాంబ శివ, సారంపాటి రాజు, చిట్టి, కర్రి బుజ్జి, సిహెచ్ నాగేంద్ర, మహేష్, సాయి, వీరు, అంజి, వి శివ, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత : ఎమ్మెల్యే




సామర్లకోట, జూలై 3, జి ఎస్ బి వార్త : పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత అని దానికి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సామర్లకోట మఠం సెంటర్ వద్ద దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, ప్రిన్సిపాల్ వంశీ ప్రియాంక, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను విడిచి, గుడ్డ సంచులు తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ కారణంగా అత్యంత ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే చినరాజప్ప వివరించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ మాట్లాడుతూ ఇంటింటా ఒక్కొక్క మొక్కను నాటితే గ్రామాలు, పట్టణాలు వనాలుగా మారుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దుర్గాప్రసాద్ పాఠశాల అందించిన 500 మొక్కలను ప్రజలకు ఎమ్మెల్యే చినరాజప్ప, ప్రజాప్రతినిధులు, ప్రజలకు, దుకాణదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి,గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, అరుణ్ వంశీ, గంగాధర్, సోమేశ్వరరావు మాస్టర్, సీఐ ఎ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం ఎస్ఐ గా పాపారావు భాధ్యతలు...



పెద్దాపురం, జూలై 3, జి ఎస్ బి వార్త : పెద్దాపురం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా యు పాపారావు శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. పెద్దాపురం ఎస్ఐ గా ఇప్పటి వరకు పనిచేసిన వి మౌనిక ఒక కేసు విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో కాకినాడ వి ఆర్ కు వెళ్ళగా ఆమె స్థానంలో ఇప్పటివరకు తుని లో ఎస్ఐ గా పనిచేస్తున్న పాపారావు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయమే భాధ్యతలు స్వీరకరించారు. అనంతరం ఆయన పెద్దాపురం డి ఎస్పీ ఎబిజి తిలక్ ను, సిఐ వై ఆర్ కె శ్రీనివాస్ లను మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం స్థానిక స్టేషన్ సిబ్బందితో ఆయన సమావేశమై స్టేషన్ పరిధిలో నేరాల వివరాలు, రాజకీయ నేపథ్యం, సామాజిక పరిస్థితులపై అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పాపారావు కు స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న విద్యుత్ శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.న్ రామకృష్ణ

ఆత్రేయపురం (జిఎస్బి వార్త) జూలై 3 : కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎపి విద్యుత్ శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ విశాఖపట్నం ఎస్ పి . కె ఎన్ రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులతో శ్రీ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## హెల్మెట్ ఉపయోగం పై డిఎస్పీ అవగాహన




సామర్లకోట, జూలై 3, జి ఎస్ బి వార్త : వాహనదారులు హెల్మెట్ వాడటం వలన కలిగే ఉపయోగాలపై పెద్దాపురం డి ఎస్పీ ఎబిజి తిలక్ అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ సృష్టికర్త గాట్లిబ్ డైమ్లర్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం సామర్లకోట లో లక్ష్మీ గణపతి మోటార్ సైకిల్ రిపేర్ వర్కర్స్ రెండో యూనియన్ ఆద్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దాపురం డీఎస్పీ తిలక్ హాజరై మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపేటప్పుడు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. దానితో ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం ముప్పు తప్పుతుందన్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఎ కృష్ణ భగవాన్, ఎస్ఐలు మూర్తి, రాజా, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగా రావు మోటార్ సైకిల్ రిపేర్ వర్కర్స్ యూనియన్ నాయకులు, మెకానిక్ లు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలి



పెద్దాపురం, జూలై 3, జి ఎస్ బి వార్త : పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. శుక్రవారం పెద్దాపురంలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్రాక్ షూట్లు, షూస్, ఇతర విద్యా పరికరాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. మంత్రి లోకేష్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ కోరారు. ప్రిన్సిపాల్ చల్లా లోవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేతలు రంది సత్యనారాయణ, సరోజ వాసు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా పర్యావరణ వేడుకలు



సామర్లకోట, జూలై 3, జి ఎస్ బి వార్త : సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలోని శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని సందర్భంగా ప్లాస్టిక్ సంచులను వాడారాదనీ ప్రజలలో అవగాహన కల్గిస్తూ క్లాత్ బ్యాగ్ లను వాడాలని కోరుతూ క్లాత్ బ్యాగ్ లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి వాటిల్లుతున్న నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని, జలాలను కలుషితం చేయకుండా కాపాడటం కోసం అందరూ ప్లాస్టిక్ వాడటం మనాలి అని ఒక ప్లాస్టిక్ సంచి పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి 400 నుండి 1,000 సంవత్సరాల సమయం పడుతుంది. ప్లాస్టిక్ ముక్కలుగా విడిపోయి నేలను, నీటిని కలుషితం చేస్తుందని, జీవులకు ముప్పు సముద్రంలో కలిసే ప్లాస్టిక్ వ్యర్థాలను తిని తాబేళ్లు, చేపలు వంటి వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. కావున ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా గుడ్డ సంచులు, జనపనార సంచులు మరియు కాగితపు సంచులు ఉపయోగించాలని గంగాధర్ సూచించారు. ఈ కార్యక్రమాలలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, నువ్వుల బాబ్జి, కమ్మిల వెంకటేశ్వరావు, ఆచంట సత్యనారాయణ, టివివి, తెలుగుంట్ల నరసింహారావు, టి సాంబ శివరావు, టి సూర్యప్రభాకర్, సాయి వంశీ టి లక్ష్మి, నువ్వుల శేషవేణి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## క్లాప్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం

పెద్దాపురం, జూలై 3, జి ఎస్ బి వార్త : ఇండియన్ క్రిస్టియన్ డే పురస్కరించుకుని పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంకు నందు క్లాప్స్ సంస్థ వ్యవస్థాపకులు రెవ. డాక్టర్ పురుషోత్తం దాస్ లంక ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ దాసు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడంవల్ల ఆరోగ్యానికి మంచిదని, ఒక యూనిట్ రక్తంద్వారా ఒక వ్యక్తి ప్రాణం కాపాడగలిగినవారము అవుతాయన్నారు. ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా పెద్దాపురం క్లాప్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొని రక్తదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ సీబీఐ సుకుమార్, రెవ. సత్యానందనం, రెవ. ఎల్ జ్ఞానానందనం, రెవ. నాగ శ్రీనివాస్ (జేమ్స్), రెవ. జి ఎస్.ప్రకాశ్ రావు, పాస్టర్ ఎన్ సుకుమార్ సహాయం, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.




## సమస్యలు లేని నియోజకవర్గం లక్ష్యం : ఎమ్మెల్యే



పెద్దాపురం, జూలై 3, జి ఎస్ బి వార్త : పెద్దాపురం నియోజకవగాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దటం కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, నాయకులు నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, యార్లగడ్డ చిన్ని, కంటే జగదీష్ మోహన్, గుమ్మళ్ళ రామకృష్ణ, బలుసు వాసు, రేలంగి వెంకటరావు, రామలక్ష్మి, గుత్తుల సూర్యవతి, పెంకే వెంకటేష్ బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు...



పెద్దాపురం, జూలై 3, జి ఎస్ బి వార్త : పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకరీతిలో అలంకరించి బంగారు వెండి పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలు తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పూజల్లో భాగంగా జరిగిన ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామిక వేత్తలు గా ఎదగాలి .

### పీఠాధిపతి డా. ఉమర్ అలీషా .




కాకినాడ సిటీ జూలై 3 జి ఎస్ బి వార్త : శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం కాకినాడ ఆశ్రమంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫర్హానా అలీషా పేపర్ ప్లేట్స్ తయారీ యూనిట్లను పీఠాధిపతి డా. ఉమర్ అలీషా ఆవిష్కరించగా,జేఎన్టీయూకే కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. పద్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సమన్వయకర్త పేరూరి కోమలి కార్యక్రమ విశిష్టతను వివరించి మహిళా ఆర్థిక సాధికారతకు దారి తీస్తుందని అన్నారు. పీఠాధిపతి డా. ఉమర్ అలీషా మాట్లాడుతూ ఒక గృహంలో మహిళ అభివృద్ధి సాధిస్తే, కుటుంబ సభ్యులందరూ ఉన్నతిని సాధస్తారని అన్నారు. మహిళలు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని అన్నారు. గిరిజన మహిళల కోసం ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా చీమలవారి గూడెంలో ఎన్నెన్నో మహిళాభివృద్ధి కార్యక్రమాలు కట్టా లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందని అన్నారు. మహిళలు కాలాన్ని సద్వినియోగం చేసుకుని మహిళా పారిశ్రామిక వేత్తలుగా,ఒక రోల్ మోడల్ గా పరిణామం చెందాలని డా. ఉమర్ అలీషా అన్నారు. ప్రతీ మహిళా మూడు మొక్కలు నాటి, ఎల్నినో వంటి వర్షాభావ పరిస్థితులను అదిగమించి, పర్యావరణ పరిరక్షణ కు కృషి చేయాలని డా. ఉమర్ అలీషా ప్రసశీగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యవర్గ సభ్యులు మండా యెల్ల మాంబ, కాకినాడ లక్ష్మి,చిర్ల లలిత, దాట్ల శ్రీదేవి మరియు 9 మంది ఆశ్రమ కమిటీ సభ్యులు, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు పేరూరి సూరిబాబు,ఏవివి. సత్యనారాయణ,చిర్ల వెంకట రెడ్డి పాల్గొన్నారు.

## గోసాలకు ఎండు గడ్డి వితరణ



పెదపూడి(జి ఎస్ బి వార్త) : కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ బిక్కవోలు రోడ్డులో గల మామిడాడ శ్రీ మణికంఠ స్వామి దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుచున్న గో సంరక్షణ కేంద్రం గోసాలకు యానం కి చెందిన రవి జూనియర్, డిగ్రీ కళాశాల అధినేత కాపులపాలెంకు చెందిన పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు రెండు ట్రాక్టర్ల ఎండు గడ్డిని పంపించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి తెలిపారు. యానం నుండి సుమారు 30 వేల విలువ కలిగిన గడ్డిని గోశాలలో గోవులకు మేతగా ఉపయోగించాలని గో సంరక్షణ మనందరి బాధ్యతగా సమాజానికి తెలియజేయాలని సంకల్పంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. మామిడాడ గోసాల డి ఆర్ కే రెడ్డి గురుస్వామి సారథ్యంలో గొప్పగా నిర్వహించబడుచున్నదని ఈ గోసాలను పలుమార్లు సందర్శించడం జరిగిందని ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గో సంరక్షణకు తమ వంతు సహాయ సహకారములు అందించవలసినదిగా కోరుతున్నట్లు భగవాన్ రెడ్డి తెలిపారు.

RNI AP BIL14872/2024
వార్త
04-07-2026

## ప్రభుత్వ విధానాలే విశాఖఉక్కు ప్రమాదానికి కారణం

**ఏవి నాగేశ్వరరావు (సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)**

**మృతుల కుటుంబాలకు కోటి, క్షతగాత్రులకు 50 లక్షల పరిహారానికి కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్**

**ఉక్కుప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసి దోషులను శిక్షించాలని నినాదాలు**




కాకినాడ సిటీ జూలై 3 జి ఎస్ బి వార్త : కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రమాదంలో చనిపోయిన పదిమంది కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు 50 లక్షల పరిహారం అందించాలని, ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం అనంతరం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రమాదానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని విమర్శించారు, విధానాల రూపకల్పనలో ఏమాత్రం సంబంధంలేని 6గురు చిరుద్యోగులను సస్పెండ్ అసలు దోషులను రక్షిస్తున్నారన్నారు. రిటైర్ జడ్జితో న్యాయ విచారణ జరిపి అసలు దోషులను శిక్షించాలని కోరారు. ప్రమాదం సందర్భంగా పరామర్శకొచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వ్యవహారశైలి ప్రమాద మృతుల త్యాగాలను అవమనపరిచేలా ఉందన్నారు. గత రెండేళ్ల నుండి పరిశ్రమ యంత్రాలకు కనీస నిర్వహణ చేయపోవడం, నాణ్యతలేని ఫెర్రో అల్లాయిస్ ఉపయోగించడం, 5వేల మంది కార్మికులను తొలగించడం, భద్రతా లోపాలను ఎత్తిచూపిన కార్మిక సంఘాల వినతులు పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదంలో 7గురు పర్మినెంట్ కార్మికులు, ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మృతులకు 2 లక్షలు పరిహారం ప్రకటించి దేశభక్తియుత కార్మికుల త్యాగాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవహేళన చేసిందని, ఇచ్చిన 1100 కోట్ల ప్యాకేజీలో ఒక్క రూపాయి కూడా పరిశ్రమ భద్రతకు ఉపయోగించకుండా అప్పుల పేరుతో తిరిగి తీసుకుందన్నారు. 4 లేబర్ కోడ్ల పేరుతో పరిశ్రమలలో సేఫ్ట్ అధికారుల తనిఖీలను ఆపేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ వేలకోట్ల ఆస్తులను కాజేయలనే ప్రేవేటీకరణ వ్యామోహంలో కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ఎట్టి పరిస్థితులలో పోరాడి, త్యాగలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. వర్షంలో కూడా పిలుపును అందుకుని ధర్నా జయప్రదం చేసిన కార్మికవర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ ఐఎన్టియుసి నాయకులు తాళ్లూరి రాజు వందన సమర్పణచేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పలివేల వీరబాబు, మెడిశెట్టి వెంకట రమణ, టి.రాజా, నాగాబత్తుల సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, మెడికల్ రీప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, నగర అధ్యక్షులు స్వామి, జిజిహెచ్ శానిటేషన్ సంఘం నాయకులు విజయ్ కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏడుకొండలు, సెక్యూరిటీ గర్డ్స్ యూనియన్ సేరు దుర్గ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు జ్యోతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతీప్రియ, నాగలక్ష్మి, వేణి, పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పెండెం సూర్యారావు, భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు హరనాద్, ఏఐటీయూసీ నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, మన్నాద రాజేష్, కెవి.రామయ్య, రాజు, జాన్ బాబు, ముద్దాడ కృష్ణ, నిమ్మకాయల ఈశ్వరరావు, బంగారు హరికృష్ణ, సింగంపల్లి రమణ, ఐఎన్టియుసి నాయకులు డి.అప్పలకుమార్, డి.అశోక్ కుమార్, బాలు, శివ, వివివి.రమణ, ఐఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి రాగుల రఘువులు, మేడపాటి గోపాలకృష్ణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రత్తి వెంకటరావు, పెండ్యాల రాము, పోర్టు కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొమ్మిడి వెంకటేశ్వరరావు పదవి విరమణ అభినందన ఆత్మీయ సమావేశం




ఐ. పోలవరం జులై03 ( జియస్ బి వార్త) : ఐ. పోలవరం మండలంలోని కారువకుల్లంక గ్రామానికి చెందిన ఐ. పోలవరం ముమ్మిడివరం అమలాపురం కాకినాడ పలు ప్రాంతాల్లో పోలీస్ గా బాధ్యతలు చేపట్టి ముఖ్యంగా ఐ. పోలవరం ఎదురుల్లంక పోలీసు స్టేషన్లో ఎ ఎస్ గా పలు సేవలు అందించి మండల ప్రజల అభిమానాన్ని పొందారు పోలీస్ ఉద్యోగం లో 38 సంవత్సరాలగా డిపార్ట్మెంట్ పలు సేవలు అందించారు బొమ్మిడి వేంకటేశ్వరావు ఇటీవల కాకినాడ లో ఎస్ ఐ గా పదోన్నతి పొంది గత నెల30 న ఉద్యోగ విరమణ పొందారు కాకినాడ లో శుక్రవారం నాడు ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశం ఏర్పాటు ఈ సమావేశంలో పలువురు తోటి ఉద్యోగులు అధికారులు నాయకులు స్నేహితులు బంధువులు కారువకు ల్లంక గ్రామస్తులు కుటుంబ సబ్యులు బొమ్మిడి వెంకటేశ్వరా రావు దంపతులు ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ ఉద్యోగవిరమణ ఆత్మీయ అభినందన ఆత్మీయ సమావేశంలో ఐ.పోలవరం మండలం వై యస్ ఆర్ పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు ఐ.పోలవరం మండలం జెడ్పి టిసి ముదునూరి సతీష్ రాజు పలువురు పోలీస్ అధికారులు ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద డిల్లీ నారాయణ వడ్డీ గౌతమ్ సుంకర నాగబాబు ఏలూరి ఆదినారాయణ సఖిలే వెంకటేశ్వర రావు మూల పర్తి శ్రీను ఎలిపే రాజేష్ బీర చిన్నారావు కాశి పరివాజ్ వక పల్లి శాస్త్రి రేవు అప్పల స్వామి కుమార్ మట్టా గగన వీరుడు రేవు ధన రాజు ఐ. పోలవరం కరవాకు ల్లంక గ్రామప్రజలు పాల్గొని పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు

## సబ్-రిజిస్ట్రార్ శ్రీ లక్ష్మి కి వినతి పత్రం అందజేసిన లేఖర్లు

అమలాపురం, జూలై 3: స్థిరాస్తులు మరియు ఆస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్ల సేవలు ప్రయివేటీకరణను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్ట్ లు అమలాపురం సబ్-రిజిస్ట్రార్ ఆర్. శ్రీ లక్ష్మి కి వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ వినతి పత్రంలో జి.ఓ. నెం.396 జారీ చేయుటద్వారా ప్రయివేటి కరణ నిలుపుదల చేయాలని, దస్తావేజు లేఖర్లుకి లైసెన్సులు పునరుద్ధించాలని లేఖర్లు కోరారు. అలాగే ఎలాంటి వివాదాలు లేకుండా ప్రజలకు రిజిస్ట్రేషన్ తాలుకు సేవలను దస్తావేజు లేఖర్లు తమ తమ తరతరాల అనుభవంతో క్రయ విక్రయ దారులకు తమ సేవలను అందుస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలం నాటి నుండి కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల వ్యవస్థను నిర్మూలించాలనే ఉద్దేశాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రయివేటు కరణ చేయుటకు ఇటీవల ఇచ్చిన జి.ఓ. నెం396ని ఉపసంహరించుకోవాలని, ప్రజలుకి రిజిస్ట్రేషన్ జాప్యం, సమయం వృథా, మరియు అదనపు సొమ్ములును చెల్లించి నష్టపోవలసిన పరిస్థితులు ఏర్పాడతాయని దస్తావేజు లేఖర్లు తెలియజేసారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**పీజీఆర్ఎస్‌లో ప్రజల వినతులు స్వీకరించిన - ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు**




ఐ. పోలవరం జులై 04 ( జియస్ బి వార్త) మురమళ్ళలోని శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయంలో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు కు అందజేశారు. అర్జీదారుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు , వెంటనే పరిష్కరించగల అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, మరికొన్ని సమస్యలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు.

## వడ్డీల పేట రామాలయానికి బదిరెడ్డి 50 వేల రూపాయలు విరాళం..



కోరుకొండ జూలై 3 (జి ఎస్ బి వార్త) కోరుకొండ వడ్డీల పేటలో నూతనంగా నిర్మించిన రామాలయానికి, ఉత్సవ విగ్రహాలు కొనుగోలు నిమిత్తం ఆలయ కమిటీ వారికి శుక్రవారం 50 వేల రూపాయలు జనసేన మండల గౌరవ అధ్యక్షుడు బదిరెడ్డి దొర అందించడం జరిగింది. గతంలో గుడి నిర్మాణానికి 50 వేలు రూపాయలు అందించడం జరిగింది. మొత్తంగా ఒక లక్ష రూపాయలు వడ్డీల రామాలయ ఆలయకమిటీ వారికి విరాళం అందించడం జరిగిందని బదిరెడ్డి పేర్కొన్నారు. స్వామివారు ఈ చక్కటి సదవకాశాన్ని మాకు కల్పించడం మా అదృష్టంగా భావిస్తూ భావిస్తున్నట్లుగా బదిరెడ్డి దొర పేర్కొన్నారు.

## వనదుర్గమ్మ ఆలయంలో వైభవంగా "ఖడ్గమాల" పూజలు

**ఘనంగా చండీ హోమం**




అన్నవరం,(జి యస్ బి వార్త), జులై - 3 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం రత్నగిరి కొండపై వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఖడ్గమాల పూజలు,చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతన ఆర్జిత సేవగా ప్రారంభమైన ఖడ్గమాల పూజలు ఉదయం 7.30 నుండి 8.30 వరకూ నిర్వహించారు. 1116/- రూపాయల టిక్కెట్ రుసుముతో పలువురు భక్తులు ఖడ్గమాల పూజలలో పాల్గొన్నారు. పూజలు అనంతరం వారందరికీ అమ్మవారి రాగి రూపు,కంకణం,అమ్మవారి కుంకుమ,శేషవస్త్రం, 250 గ్రాముల పులిహోర ప్రసాదంగా అందజేశారు. అనంతరం ఉదయం 9 గంటలకు అమ్మవారికి చండీహోమం ప్రారంభించారు. ఈసందర్భంగా పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహ వచనం,అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు. హోమం వద్ద విశేష పూజలు అనంతరం ఉదయం 11 గంటలకు అర్చకులు, ఋత్వికులు హోమ గుండంలో పవిత్ర ద్రవ్యాలు సమర్పించి చండీహోమానికి పూర్ణాహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు మరియు వేదపండితులు,ఋత్విక బృందం తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గత దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు సతీమణి హైమావతి,దేవస్థానం పాలకమండలి సభ్యులు కామర్సు చిరంజీవిరావు,ఎలక్ట్రికల్ విభాగం డిఇ విశ్వనాధుల సత్యనారాయణ,ప్రముఖులు, అధికారులు,సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

**...ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బుజ్జిబాబు**




పెదపూడి(జి ఎస్ బి వార్త) : పెదపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి బుజ్జిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన తులసీరామ్ వీఆర్ కు బదిలీ అయ్యా రు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ 2 టౌన్ నుంచి పెదపూడి స్టేషన్ కు ఎస్ఐగా బుజ్జిబాబు వచ్చారు. ఏఎస్ఐ, స్టేషన్ సిబ్బంది ఎస్సైకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ బుజ్జిబాబు మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో సేవలు అందిస్తామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కట్టిన చర్యలు తీసుకుంటామని, మండలంలో గంజాయి రవాణా, గంజాయి అమ్మకాలు, గంజాయి వాడకం పై ప్రత్యేక దృష్టి పెడతామని, పేకాట క్లబ్బుల పై పేకాట ఆడే వారిపై ప్రత్యేక డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గొల్లలమామిడాడ గ్రామంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

## కాకినాడలో ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం

**ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం**




కాకినాడ సిటీ జూలై 3 జి ఎస్ బి వార్త : భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలో పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సబ్బవరం గ్రామంలో రెవ. డేవిడ్ లివింగ్‌స్టన్ చర్చిలో ఈ శిబిరాన్నికి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షులు రెక్కి గూటం ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పలు హాస్పిటల్ నుండి వచ్చిన వైద్యులు ఎముకలు మరియు కీళ్లు సమస్యల పరీక్షలు కంటి మరియు దంత సమస్యలు బిపి, షుగర్, థైరాయిడ్, మరియు కొలెస్ట్రాల్ ,పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెయింట్ థామస్ మరణదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జూలై 3వ తేదీన 'భారతీయ క్రైస్తవ దినోత్సవం'గా నిర్వహిస్తూ, పలుసేవాకార్యక్రమాలు సబర్బన్ ఏరియా పాస్టర్స్ వెల్ఫేర్అసోసియేషన్చేపట్టడం అభినందనీయమన్నారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు రెక్కి గూటం మాట్లాడుతూ క్రీస్తు శకం 52 లో భారతదేశానికి సువార్తను మోసుకొచ్చి క్రీస్తు శకం సమీపంలో హత సాక్షిగా ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు శిష్యుడైన థామస్ (అపోస్తులైన సెయింట్ థామస్) జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం జూలై 3వ తేదీని సాంప్రదాయకంగా 'భారతీయ క్రైస్తవ దినోత్సవం'గా పాటిస్తున్నారని , ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని సబర్బన్ ఏరియా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎం.డి. రాజు, అధ్యక్షులు వి. ప్రసాద్ పాల్, సెక్రటరీ ఏసుదాసు, ట్రెజరర్ శాంసన్ రాజు, వైస్ ప్రెసిడెంట్ కె. జార్జి బాబు మరియు సంఘ సభ్యులు, భాను ఐ కేర్ లత, డెంటల్ డాక్టర్ రేనా పెర్సీ డాక్టర్ జెసిక, మిత్ర హాస్పిటల్ ఓబుల్ రెడ్డి , డాక్టర్ భార్గవి వీరేంద్ర చైతన్య మౌనిక మధు ఏవో రామకృష్ణ ,త్రినేటి డాక్టర్ రామ్మూర్తి డాక్టర్ కార్తీక్ హరి డాక్టర్ విజయమోహన్ డాక్టర్ మౌనిక డాక్టర్. రామ,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిషి చారిటబుల్ ట్రస్ట్ నుంచి ప్రతిభా పురస్కారాలు




కాకినాడ జూలై 3(జిఎస్ బి వార్త) రిషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మరియు సీబీఎస్సీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కాకినాడ రమణయ్యపేటలోని లయన్స్ క్లబ్ మల్టీ సర్వీస్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీ ప్రసాద్ నాయుడు ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది విద్యార్థులకు శాలువా కప్పి, మెమెంటోలు మరియు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, "క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమతో విద్యార్థులు జీవితంలో అత్యున్నత విజయాలను సాధించగలరు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరెందరో విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలన్నదే రిషి చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యం" అని అన్నారు. సత్కారం పొందిన విద్యార్థులు వివిధ విద్యాసంస్థలకు చెందినవారని, తమ విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకొచ్చారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాదం బాల కృష్ణ, అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు చింతపల్లి సుబ్బారావు, వి ఎస్ ఆర్ మూర్తి, నాగిని మరియు సిహెచ్ నాగేంద్ర గాంధీ తదితరులు పాల్గొన్నారు. సత్కారం పొందిన విద్యార్థులు:

- వీ. ముకేశ్ -- లక్ష్య స్కూల్ , కాకినాడ
- రోబిన్ రోయ్ -- ఆదిత్య జూనియర్ కాలేజీ , కాకినాడ
- సత్య హరి చరణ్ -- ఆదిత్య జూనియర్ కాలేజీ , కాకినాడ
- రిషి -- ఆదిత్య జూనియర్ కాలేజీ , కాకినాడ
- శ్రీ కృష్ణ -- నారాయణ జూనియర్ కాలేజీ , కాకినాడ
- దేశం కార్తీక -- శశి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ , వెలివెన్ను
- బ్యాచ్చు ఆకర్షణ -- ఆదిత్య టాలెంట్ స్కూల్ , కాకినాడ
- అంగర -- నారాయణ జూనియర్ కాలేజీ , కాకినాడ
- అంజూరి సాయి కుమార్ -- ఆదిత్య జూనియర్ కాలేజీ , కాకినాడ

కార్యక్రమం అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆహ్వానితులకు విందు ఏర్పాటు చేశారు.

## జనసేన సమాచార సేకరణ ప్రక్రియ కొనసాగింపు...

అమలాపురం, జూలై 3: అమలాపురం పార్లమెంటు పరిధిలో జనసేన సారథుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోందని అమలాపురం పార్లమెంటు పరిశీలకులు, ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. దీంతో దరఖాస్తుదారుల నుండి వచ్చిన అభ్యర్థనలను పరిశీలించిన తర్వాత జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ సమాచార సేకరణ ప్రక్రియను జులై 5 తేదీ ఆదివారం సాయంత్రం వరకు పొడిగిస్తూ నిర్ణయించారు. అలాగే ఈ రెండు రోజులు కూడా ఈ ప్రక్రియను స్థానిక సత్యనారాయణ గార్డెన్స్ నందు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియచేశారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియను అమలాపురం పార్లమెంటు పరిధిలో ఉన్న 7 నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం ఆయన కోరారు.

Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.



# సినీ కబుర్లు

## 'సూపర్ సుబ్బు' వెబ్ సిరీస్ రివ్యూ

నటీనటులు: సందీప్ కిషన్- మిథిలా పార్కర్- మానస చౌదరి- మురళీ శర్మ- గెటప్ శీను- సంపూర్ణేష్ బాబు- జీవన్ తదితరులు సంగీతం: అనుదీప్ దేవ్ ఛాయాగ్రహణం: ఏజే ఆరోన్ నిర్మాతలు: రాజీవ్ చిలక- భరత్ లక్ష్మీపాటి రచన: మల్లిక్ రామ్- రమేష్ ఎలిగేటి- శివాని దోబల్ దర్శకత్వం: మల్లిక్ రామ్ మన సినిమాల్లో హీరోయిన్లతో హద్దులు దాటి ఎక్స్పోజింగ్ చేయించడం.. రొమాంటిక్ సన్నివేశాలను చాలా ఘాటుగా చూపించడం దశాబ్దాల ముందు నుంచే ఉన్నప్పటికీ.. పడక గదిలో విషయాల గురించి ఓపెన్ గా చర్చించే కథాంశాలతో సినిమాలు తీయడం మాత్రం అరుదే. వీర్యదానం గురించి బాలీవుడ్లో 'విక్కీ డోనర్' అనే సినిమా తీస్తే బ్లాక్ బస్టర్ కాగా.. అదే చిత్రాన్ని తెలుగులో 'నరుడా డోనరుడా' పేరుతో రీమేక్ చేస్తే డిజాస్టర్ అయింది. కానీ ఆ సినిమా వచ్చినప్పటి రోజులు వేరు. ఇప్పటి రోజులు వేరు. హీరో అంగం చిన్నదిగా ఉ ఒడడం మీద 'ఏక్ మినీ కథ' అంటూ సినిమా తీసేంత బోల్డుగా ఇండస్ట్రీ మారితే.. దాన్ని ఆదరించి ప్రేక్షకులు కూడా తమలో వచ్చిన మార్పును చాటుకున్నారు. అందుకేనేమో 'నరుడా డోనరుడా' దర్శకుడు మల్లిక్ రామ్ సెక్స్ ఎడుకేషన్ ఆఫీసర్ పాత్రను లీడ్ రోల్ లో పెట్టి 'సూపర్ సుబ్బు' అంటూ నెట్ ఫ్లిక్స్ వెబ్ సిరీస్ తీశాడు. ఐతే సెక్స్ ఎడ్యుకేషన్ మీద సినిమా అంటే వల్గారిటీ ఉంటుందని.. సన్నివేశాలను హద్దులు దాటించేసి ఉంటారని.. మాటల్ని బూతులతో నింపేసి ఉ ంటారని భయపడాల్సిన పనేమీ లేదు. కుటుంబమంతా కలిసి చూసే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ తో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దింది మల్లిక్ రామ్ అండ్ టీమ్. కొంచెం ఓపెన్ మైండ్ తో చూస్తే అందరూ రిలేట్ చేసుకునే కాన్సెప్ట్.. దాని చుట్టూ ఆద్యంతం వినోదం పంచే సన్నివేశాలు.. ఫన్నీ డైలాగులతో ఆద్యంతం ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తూ సాగుతుంది 'సూపర్ సుబ్బు'. సొసైటీ ఎంత మారినా సరే.. సిటీల్లో కూడా ఇప్పటికీ ఎక్కువమంది 'సెక్స్' అనే మాటను పెద్ద బూతుగానే భావిస్తారందరూ. ఇక పల్లెటూళ్ల సంగతి అయితే చెప్పాల్సిన పని లేదు. మరి బాగా వెనుకబడ్డ పల్లెటూరిలో 'సెక్స్ ఎడ్యుకేషన్' పాఠాలు చెప్పడానికి వెళ్లిన ఒక కుర్ర టీచర్.. ఇవేవీ అర్థం కాని అక్కడి జనాల తీరుతో ఎలా తంటాలు పడ్డాడు అన్నదే ఈ కథ. హీరో ఎందుకు అక్కడికి వెళ్లాల్సి వచ్చింది.. దాని వెనుక స్టోరీ ఏంటి అన్న దాని మీద ఒకట్రెండు ఎపిసోడ్లను వినోదాత్మకంగా నడిపించారు. వయసుతో పాటు వచ్చే ఆకర్షణల వల్ల తండ్రి దగ్గర హీరో ఎలా ఇరుక్కున్నాడు.. తండ్రి మీదున్న భయంతో అతనెలా కుచించుకుపోయాడు.. అన్నది చూపిస్తూ హీరో క్యారెక్టర్ని మొదట్లో బాగా ఎస్టాబ్లిష్ చేశారు. స్కూల్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు భలే ఫన్నీగా అనిపిస్తాయి. హీరోను ఒక ట్రికీ సిచువేషన్లో పెట్టి అతణ్ని సెక్స్ ఎడుకేషన్ ఆఫీసర్ గా ఊరికి పంపించడంలో కాన్ఫ్లిక్ట్ బాగా పండింది. ఇక హీరో ఊరిలో అడుగు పెట్టిన దగ్గర్నుంచి నాన్ స్టాప్ ఫన్ తో నడుస్తుంది 'సూపర్ సుబ్బు'. అక్కడుండే ప్రతి పాత్రా వినోదాన్ని పంచుతుంది. ఊరి జనాల ప్రవర్తనతో హీరో పడే పాట్లు భలే ఫన్నీగా ఉంటాయి. 'వకీల్ సాబ్' సినిమాలో పాపులర్ అయిన 'నో మీన్స్ నో' డైలాగ్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు నవ్వులు పండిస్తాయి. ఎక్కువ హడావుడి లేకుండా చాలా వరకు సింపుల్ సీన్లతోనే కథనాన్ని నడిపించారు. సిచువేషనల్ కామెడీ పండించడానికే ప్రయత్నించారు. సర్పంచ్ పాత్ర చేసిన నటుడితో పాటు జీవన్.. గెటప్ శీనుతో పాటు హీరోయిన్ మిథిలా పార్కర్ క్యారెక్టర్లు ప్రేక్షకులను బాగా ఎంగేజ్ చేస్తాయి. ప్రతి పాత్రలోనూ కామెడీ కోణం కనిపిస్తుంది. ఐతే కేవలం కామెడీకి పరిమితం కాకుండా కొన్ని సీన్లలో బలమైన ఎమోషన్లనూ పండించారు. ఈ కథ ద్వారా ఇచ్చిన సందేశం ప్రశంసనీయం. జనాభా నియంత్రణ.. కండోమ్స్- శానిటరీ ప్యాడ్స్ వినియోగం.. లాంటి అంశాలను వినోదం మేళవించి జనాలకు మెసేజ్ ఇచ్చిన తీరు ఆకట్టుకుంటుంది. రిలేషన్షిప్స్ గురించి డీల్ చేసిన విధానం కూడా బాగుంది. ఏడు ఎపిసోడ్ల పాటు సాగే 'సూపర్ సుబ్బు' చాలా వరకు ఎంగేజింగ్ గా సాగినా.. మధ్య మధ్యలో కొంచెం నెమ్మదిగా నడుస్తుంది. డీవియేట్ అవుతుంది. కొన్ని




చోట్ల లాజిక్ మిస్ అయినట్లు కనిపిస్తుంది. హీరో ఏ లక్ష్యం కోసమైతే వచ్చాడో.. దాన్ని నెరవేర్చడానికి ఎంత వరకు సిన్సియర్ గా కష్టపడ్డాడు అన్నది ప్రశ్నార్థకమే. ఊరి జనాల్లో మార్పు తెచ్చేందుకు అతను గట్టి ప్రయత్నమేదీ చేసినట్లు కనిపించదు. హీరోను సన్మానించే రేంజిలో అతను పెద్దగా ఏమీ చేయడు. ఊరిలో మార్పు కూడా తీసుకురాడు. సిరీస్ సీరియస్ అయిపోతుందనో ఏమో.. ఎక్కువగా కామెడీ మీదే దృష్టిపెట్టడం వల్ల అసలు కథ కొంచెం పలుచబడ్డ ఫీలింగ్ కలుగుతుంది. అయినా సరే.. ఈ సిరీస్ ఎక్కడా బోర్ అయితే కొట్టించదు. రమేష్ ఎలిగేటి.. శివాని దోబల్ లతో కలిసి మల్లిక్ రామ్ రాసిన స్క్రిప్టే ఈ సిరీస్ కు ప్రధాన బలం. కాన్సెప్టుకు తోడు సింపుల్ సీన్లు.. ఫన్నీ డైలాగులతో టీం ఆద్యంతం ప్రేక్షకులను ఎంగేజ్ చేసింది. మల్లిక్ రామ్ టేకింగ్ కూడా బాగుంది. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా బాగున్నాయి. ఆరోన్ ఛాయాగ్రహణం.. అనుదీప్ దేవ్ సంగీతం కూడా ఆకట్టుకుంటాయి. బిట్ సాంగ్స్ తో పాటు బీజీఎం విషయంలోనూ అనుదీప్ మంచి పనితనం చూపించాడు. ఐతే సీజన్-1 ముగింపు ఇంకొంచెం ఎఫెక్టివ్ గా ఉ:డాల్సింది. కథను ఒక చోట ఆపి.. సెకండ్ సీజన్ కు లీడ్ ఇచ్చారు. రెండో సీజన్ మరింత ఆసక్తికరంగా సాగుతుందనే అంచనాలు కలిగించారు. కాన్సెప్ట్ వినడానికి బోల్డ్ అనిపించినా.. దీన్ని డీల్ చేసిన విధానం అన్ని వర్గాల ప్రేక్షకులనూ అలరిస్తుంది.

## 'పద్మశ్రీ' అందుకున్న మొట్టమొదటి భారతీయ హాస్యనటుడు!




తెలుగు సినిమా స్వర్ణయుగంలో తనదైన మార్క్ నవ్వు.. విలక్షణమైన యాసతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహానటుడు రేలంగి వెంకట్రామయ్య. వెండితెరపై ఆయన కనిపిస్తే చాలు థియేటర్లలో నవ్వుల పువ్వులు పూసేవి. భారత ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన -పద్మశ్రీ- అందుకున్న దేశంలోనే మొట్టమొదటి హాస్యనటుడిగా రేలంగి చారిత్రాత్మక రికార్డు సృష్టించారు. -హాస్య నట చక్రవర్తి-గా కోట్లాది మందిని అలరించిన ఈ మహోన్నత నటుడి వెనుక ఎన్నో కష్టాలు, కన్నీళ్లు, అలాగే ఎవరికీ తెలియని ఆసక్తికరమైన జీవిత కథ దాగి ఉంది. 1910 ఆగస్టు 9న కాకినాడ సమీపంలోని రావులపాడులో జన్మించిన రేలంగి.. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి పితృవాత్సల్యంతో పెరిగారు. ఆయన తండ్రి రామస్వామి హరికథకులు, సంగీత విద్వాంసులు కావడంతో రేలంగికి చిన్ననాడే కళలపై మక్కువ ఏర్పడింది. తండ్రి తనను పోలీస్ ఆఫీసర్గా చూడాలనుకున్నా.. రేలంగికి నాటకాలపై ఉన్న పిచ్చితో చదువు అబ్బలేదు. తొమ్మిదో తరగతి ఫెయిల్ కావడంతో తండ్రి చేతిలో దెబ్బలు తిన్నా ఆయనలోని నటుడు ఆగలేదు. కాకినాడ -హ్యాపీ క్లబ్- నాటకాల ద్వారా నటనలో ఓనమాలు నేర్చుకుని..తండ్రి ఆశీస్సులతో రంగస్థలంపై పదేళ్లపాటు రాటుదేలారు. ఆ పట్టుదలే 1930ల కాలంలో ఆయన్ను సినీ రాజధానిగా ఉన్న కలకత్తా వైపు నడిపించింది. సినీ ప్రయాణంలో రేలంగి దాదాపు 15 ఏళ్లపాటు తెర వెనుక అసిస్టెంట్ డైరెక్టర్గా, ప్రొడక్షన్ అసిస్టెంట్ గా, కాస్టింగ్ ఏజెంట్గా ఎన్నో కష్టాలు అనుభవించారు. ఆ సమయంలోనే భానుమతి, అంజలీదేవి, కృష్ణవేణి వంటి మహానటీమణులను ఆయనే ఇండస్ట్రీకి పరిచయం చేయడం విశేషం. మద్రాసు చేరిన కొత్తలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవిచూశారు. భార్య, తండ్రి అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించడానికి కూడా డబ్బుల్లేని దుస్థితిని ఎదుర్కొన్నారు. అయితే 1948లో వచ్చిన వింధ్యరాణి, ఆ తర్వాత కీలుగుర్రం, గుణసుందరి కథ చిత్రాలు ఆయన తలరాతను మార్చేశాయి. ఇక 1950 నుండి 1970 వరకు రెండు దశాబ్దాల పాటు రేలంగి లేని తెలుగు సినిమా ఊహించుకోలేనంతగా ఆయన బిజీ అయిపోయారు. కేవలం హాస్యనటుడిగానే కాకుండా.. హీరోలతో సమానమైన ఇమేజ్ సొంతం చేసుకున్నారాయన. -మిస్సమ్మ-, -మాయాబజార్-,-పాతాళభైరవి- వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు అజరామరం. సరదా సరదా సిగరెట్టు, ధర్మం చెయ్ బాబు వంటి పాటలతో గాయకుడిగానూ మెప్పించారు. కొత్త తరం కమెడియన్ల కోసం తన సినిమాల సంఖ్యను తగ్గించుకుంటూ పత్రికల్లో ప్రకటన ఇచ్చి.. రాజబాబు, పద్మనాభం వంటి నటుల ఎదుగుదలకు కారణమైన ఆయన ధాతృత్వం నిజంగా గొప్పది. ఆ దయాగుణంతోనే పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో స్థిరపడి.. నిత్యం అన్నదానాలు చేస్తూ... పేదలకు సహాయం చేస్తూ అక్కడి ప్రజల గుండెల్లో దేవుడయ్యారు. కళారంగానికి ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం -పద్మశ్రీ-తో సత్కరించింది. తాడేపల్లిగూడెంలో అత్యాధునిక వసతులతో -రేలంగి చిత్ర మందిర్- అనే థియేటర్ నిర్మించి స్థానిక ప్రజలకు హాలీవుడ్ చిత్రాలను సైతం పరిచయం చేశారు. జీవితాంతం ఇతరుల ముఖాల్లో నవ్వులు పూయించిన ఈ నవ్వుల రేడు.. చివరి రోజుల్లో తీవ్రమైన కీళ్లనొప్పి, ఎముకల వ్యాధితో నడుము భాగం పక్షవాతానికి గురై ఎంతో నరకం అనుభవించారు. చివరకు 1975 నవంబర్ 27న తాడేపల్లిగూడెంలోని తన నివాసంలోనే ఈ హాస్య నట చక్రవర్తి కన్నుమూశారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా.. తెలుగు సినిమా ఉన్నంత కాలం అతడు పంచిన నవ్వులు అమరంగా నిలిచే ఉంటాయి.

## ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!

బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్స్టాగ్రామ్లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్లుగా మారిపోయాయి. ూశ్రీంశీ =ముఃస - ఆ హీరోయిన్స్ కు వరుస ఛాన్సులు.. అదెలా? ఇన్స్టాగ్రామ్లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది.ూశ్రీంశీ =ముఃస - రావు బహదూర్ అసలు కథ.. డైరెక్టర్ బెస్ట్ స్ట్రాటజీూసజవతీఅంవఎవత్ నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కేవలం డిజిటల్




ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ - ప్రొడక్షన్ హౌస్ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. మరోవైపు.. సౌత్ ఇండియాలో (టాలీవుడ్లో) జాన్వీ కపూర్ ఎంట్రీ ఒక సంచలనంగా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రానికి గానూ దాదాపు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు టాలీవుడ్ టాక్. ఇక గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ క్రేజీ ప్రాజెక్ట్ -పెద్ది- కోసం దాదాపు 4 కోట్ల పారితోషికాన్ని వసూలు చేసిందని ప్రచారం ఉన్నా.. దానిపై అధికారికంగా క్లారిటీ లేదు. ఇలా సినిమాలు, బ్రాండ్ ఎండార్స్మెంట్స్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ జాన్వీ కపూర్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.



గ్రీస్ విహారయాత్రలో ఆనందంతో మెరిసిపోతున్న అనన్య పాండే

GODAVARI BHAVISHATH

# VAARTHA

GODAVARI SPECIAL BULLITIN

## Rupee Rises 19 Paise Against US Dollar in Early Trade



The rupee appreciated 19 paise to 95.16 against US dollar in early trade on Friday, as the dollar index retreated from its recent 15-month high levels.Forex traders said despite a weaker dollar index and lower crude oil prices rupee is still facing pressure from robust dollar demand from importers and corporate hedgers. At the interbank foreign exchange market, the rupee opened at 95.20, then touched 95.16 against the US dollar, registering a gain of 19 paise from its previous close.

On Thursday, the rupee pared initial gains and settled for the day on a negative note, lower by 19 paise at 95.35 against the US dollar. Despite a weaker dollar index and lower crude oil prices, the rupee still weakened on Thursday. "If the rupee cannot strengthen on positive global cues, any negative development could easily push USDINR towards the 95.80 to 96.00 zone," CR Forex Advisors MD Amit Pabari said.

Pabari further added that the Reserve Bank of India is focused on restoring its forex reserves which have declined from a February peak of USD 728.49 billion to around USD 672.6 billion. Hence, the central bank has less room to allow the rupee to appreciate freely, "even when global conditions are supportive," he said. Meanwhile, the dollar index, which gauges the greenback's strength against a basket of six currencies, was trading at 100.81, lower from its recent 15-month high of 101.6.

Meanwhile, Brent crude, the global oil benchmark, was trading lower by 0.63 per cent at USD 72.25 per barrel in futures trade. On the domestic equity market front, Sensex jumped 545.89 points to 78,048.01 in early trade, while the Nifty surged 173.85 points to 24,346.90. Foreign institutional investors sold equities worth Rs 311.82 crore on a net basis on Thursday, according to exchange data. Foreign investors extended their selling spree in June, withdrawing Rs 49,340 crore (USD 5.16 billion) from Indian equities, triggered by a combination of early-month global risk aversion, a preference for developed markets, soaring US bond yields, and stretched valuations in the domestic market. According to data from the Central Depository Services (India) Ltd, the total withdrawals by Foreign Portfolio Investors (FPIs) from Indian equities have surged to Rs 2.7 lakh crore so far in 2026, surpassing the Rs 1.66 lakh crore pulled out during the entire calendar year 2025.

## Wildfires Sweep Southern France as European Heatwave Fuels Thousands of Blazes



Wildfires driven by an intense heatwave and dry conditions swept across southern France, as soaring temperatures continued to fuel thousands of blazes across Europe, forcing evacuations and prompting large-scale firefighting efforts. French authorities deployed hundreds of firefighters, aircraft and emergency personnel to battle multiple fires, particularly in the southern regions where strong winds and prolonged drought accelerated the spread of flames. Several residents were evacuated from vulnerable areas as a precaution.

Firefighters have been working around the clock to contain the blazes and prevent them from reaching populated areas, while officials urged residents to avoid activities that could spark additional fires. The wildfire crisis has affected several European countries, including France, Spain, Portugal, Italy and Greece, where emergency services remain on high alert amid forecasts of continued hot and dry weather. Meteorologists warned that climate change is contributing to more frequent and intense heatwaves across Europe, increasing the likelihood of large-scale wildfires during the summer months.

## Naidu Launches Kadapa Steel Plant Construction



Kadapa (Andhra Pradesh): Andhra Pradesh Chief Minister N Chandrababu Naidu on Friday launched the construction work of JSW Rayalaseema Integrated Steel Plant at Sunnapurallapalli and Peddadanluru villages in this district. The integrated steel plant will be developed by JSW Andhra Pradesh Steel Limited in two phases in 1,100 acres with a total investment of Rs 16,350 crore, said an official press release.

Phase I will involve an investment of Rs 4,500 crore, while Phase II will bring an additional investment of Rs 11,850 crore, taking the plant's capacity to two million tonnes per annum (MTPA). Commercial production is targeted to commence by March 2028. Designed as a modern Green Steel facility, the plant will adopt scrap-based Electric Arc Furnace (EAF) technology powered by renewable energy, significantly reducing carbon emissions.

"The project was originally approved in 2019 and witnessed foundation ceremonies in 2019 and again in 2023," said the press release. Following the formation of the TDP-led coalition government in 2024, the project was "revived" through sustained engagement with JSW, it said. The Government has advanced critical external infrastructure required for the project, said the press release, observing that dedicated water supply infrastructure is being taken up, connectivity to National Highway (NH-67) is under execution while a 12-kilometre railway link connecting the plant to Muddanuru Railway Station is being pursued through RITES under the PM Gati Shakti initiative. The project is expected to generate thousands of direct and indirect employment opportunities, promote ancillary industries across Rayalaseema and strengthen Andhra Pradesh's emergence as one of India's leading steel-producing states, the press release added.

## Telangana Records 101.4% Coverage in Pulse Polio Campaign




The statewide Pulse Polio immunization programme concluded successfully, with the health department achieving 101.4 per cent coverage, surpassing its target. According to official estimates, the state has around 4,097,749 children in the 0–5 age group. However, a total of 4,153,185 children were administered polio drops during the drive, exceeding expectations. Health officials said the achievement was made possible through a combination of polio booths and extensive door-to-door visits to identify and vaccinate children who were initially missed.

Special drives were conducted in construction sites, migrant labour colonies, high-risk areas, slums, and child care homes to ensure that no child was left out of the immunization programme. State Health Minister Damodar Rajanarsimha congratulated doctors, officials, ANMs, ASHA workers, Anganwadi staff, volunteers, and other frontline personnel for their dedicated efforts in making the programme a success.

He also appreciated parents across the state for actively participating by ensuring their children received polio drops. The minister reiterated that the government remains committed to maintaining the state's polio-free status and will continue to stay vigilant to safeguard the health of every child. He added that the success of the programme was made possible due to public cooperation and the tireless efforts of the health department staff.

## Temple Theft: SIT Reaches Ayodhya, Gets 15-Day Extension for Probe



Ayodhya: The Special Investigation Team (SIT) probing the alleged embezzlement of donations at Ram temple arrived at the temple premises to carry out further investigation in the case. The team has been granted a 15-day extension to complete its investigation. The extension has been given to enable the SIT to widen the scope of its probe and conduct a comprehensive inquiry into all aspects of the case.

The investigation will be expanded further to ensure that every angle is thoroughly examined and that no guilty person is spared. Meanwhile, the Uttar Pradesh Police on Friday intensified its probe in the Ram Mandir alleged donation embezzlement case and is currently questioning accused Avinash Shukla at the Special Operations Group (SOG) office in Ayodhya. Ayodhya Circle Officer (CO) Ashutosh Tiwari and several other officials are present at the interrogation. Avinash Shukla, who was associated with the counting of Ram temple offerings, was presented in Ayodhya court on Thursday and sent on to 24-hour police remand. Earlier on June 28, a team led by Circle Officer (CO) Ashutosh Kumar had visited Avinash Shukla's residence in Ayodhya to conduct inquiries and gather evidence.The Ram Mandir donation embezzlement controversy began after an FIR was registered on June 25 over the alleged embezzlement of donations received at the Shri Ram Janmabhoomi Temple. The Trust has maintained that it is committed to a fair investigation and to preserving the faith of devotees. According to officials, the case has been filed under multiple provisions of the Bharatiya Nyaya Sanhita (BNS), including Sections 306, 316(5), 317(4), 317(5), 61 and 3(5), on the directions of the Uttar Pradesh Government. Those who have been named in the FIR are: Avinash Shukla, Anukalp Mishra, Lavkush Mishra, Tinnu Yadav, Manish Yadav and others. This comes after allegations were made by former SP MLA from Ayodhya, Pawan Pandey, who claimed that between Rs 7 crore and Rs 7.5 crore in donations were misappropriated from the Ram Mandir.On June 29, an Ayodhya court remanded all the accused in the alleged donation embezzlement case to 14-day judicial custody following an intensive investigation into alleged financial irregularities involving temple donations.Earlier, former Trust General Secretary Champat Rai and trustee Anil Mishra resigned, taking moral responsibility for the controversy. Police have since recorded Champat Rai's statement, while statements of other senior Trust office-bearers, including Anil Mishra, may be recorded if required during the course of the investigation.

# 'పాడా' పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి..

## - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



కాకినాడ, (జిఎస్ బి వార్త) : పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పనుల్లో పురోగతి కనబరిచాలని పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. పాడా పరిధిలో చేపట్టిన పలు ప్రాజెక్టుల పురోగతిపై పాడా, పిఠాపురం మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్, డ్వామా, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాడా పీడీ డా. ఎన్.వి. శివరామ్ ప్రసాద్ వివిధ శాఖల వారీగా ప్రస్తుత పనుల పురోగతిని, సెజ్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, సంక్షేమ వసతి గృహాలు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే జనగణన, టెంపుల్ టూరిజం, వరదల కారణంగా దెబ్బతిన్న పనుల పునరుద్ధరణ, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాలు, పాఠశాల అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్ తదితర అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. పిఠాపురం నియోజకవర్గంలో పాడా పరిధిలో రూ.485.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 1157 రకాల అభివృద్ధి పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు రూ.105.71 కోట్ల వ్యయంతో 74 పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. వివిధ దశలలో ఉన్న పనులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ పనులను తప్పనిసరిగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ పనులపై వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేసి పురోగతి సాధించాలని సూచించారు. పనుల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేకంగా పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, ఏపీఎంఎస్ఐడీసీ శాఖల ద్వారా అధిక సంఖ్యలో పనులు కొనసాగు తున్నాయని, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని, తాగునీరు, పారిశుద్ధ్య సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం కమిషనర్ ఎస్.టి.వి. రాజేశ్వరరావు, గొల్లప్రోలు కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు మృతుల కుటుంబాలకు కోటి, క్షతగాత్రులకు 50 లక్షల ఇవ్వాలని ధర్నా




కాకినాడ, జూలై 3: : కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రమాదంలో చనిపోయిన పదిమంది కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు 50 లక్షల పరిహారం అందించి ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం అనంతరం కాకినాడ కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రమాదానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని విమర్శించారు. విధానాల రూపకల్పనలో ఏమాత్రం సంబంధంలేని ఆరుగురు చిరుద్యోగులను సస్పెండ్ అసలు దోషులను రక్షిస్తున్నారన్నారు. రిటైర్ జడ్జితో న్యాయ విచారణ జరిపి అసలు దోషులను శిక్షించాలని కోరారు. ప్రమాదం సందర్భంగా పరామర్శకొచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వ్యవహారశైలి ప్రమాద మృతుల త్యాగాలను అవమానపరిచేలా ఉందన్నారు. గత రెండేళ్ల నుండి పరిశ్రమ యంత్రాలకు కనీస నిర్వహణ చేయపోవడం, నాణ్యతలేని ఫెర్రో అల్లాయిస్ ఉపయోగించడం, 5వేల మంది కార్మికులను తొలగించడం, భద్రతా లోపాలను ఎత్తిచూపిన కార్మిక సంఘాల వినతులు పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదంలో ఏడుగురు పర్మినెంట్ కార్మికులు, ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మృతులకు 2 లక్షలు పరిహారం ప్రకటించి దేశభక్తియుత కార్మికుల త్యాగాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవహేళన చేసిందని, ఇచ్చిన 1100 కోట్ల ప్యాకేజీలో ఒక్క రూపాయి కూడా పరిశ్రమ భద్రతకు ఉపయోగించకుండా అప్పుల పేరుతో తిరిగి తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పలివేల వీరబాబు, మేడిశెట్టి వెంకట రమణ, టి రాజా, నాగాబత్తుల సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, నగర అధ్యక్షులు స్వామి, జిజిహెచ్ శానిటేషన్ సంఘం నాయకులు విజయ్ కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏడుకొండలు, సెక్యూరిటీ గర్డ్స్ యూనియన్ సేరు దుర్గ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు జ్యోతి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతీప్రియ, నాగలక్ష్మి, వేణి, పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పెండెం సూర్యారావు, భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు హరనాద్, ఏఐటీయూసీ నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, మన్నాడ రాజేష్, కెవి రామయ్య, రాజు, జాన్ బాబు, ముద్దాడ కృష్ణ, నిమ్మకాయల ఈశ్వరరావు, బంగారు హరికృష్ణ, సింగంపల్లి రమణ, ఐఎన్టియుసి నాయకులు డి అప్పల కుమార్, డి అశోక్ కుమార్, బాలు, శివ, వివివి రమణ, ఐఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి రాగుల రఘువులు, మేడపాటి గోపాలకృష్ణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రత్తి వెంకటరావు, పెండ్యాల రాము, పోర్టు కన్స్టక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పురుషోత్తపట్నం, తొర్రిగడ్డ ద్వారా సాగునీటి విడుదల..



కోరుకొండ జూలై 3 (జి ఎస్ బి వార్త) : కోరుకొండ, సీతానగరం మండలాల్లో 20,000 ఎకరాలకు లబ్ధి చేకూర్చిన కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , రుడా చైర్మన్ బొడ్డు వేంకటరమణ చౌదరి చేతుల మీదుగా సాగునీరు విడుదల రాజానగరం నియోజకవర్గ అన్నదాతలను ఆదుకునేందుకు, పంట పొలాలకు జలకళను తీసుకువస్తూ పురుషోత్తపట్నం తొర్రిగడ్డ పంపింగ్ స్కీము ద్వారా సాగునీటి విడుదల కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ గారు, రుడా (=ఖణూా) చైర్మన్ శ్రీ బొడ్డు వేంకటరమణ చౌదరి గారు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేయడం ద్వారా సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. "రాజానగరం నియోజకవర్గంలోని అన్నదాతలు నీటి ఎద్దడితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, పంటలు సాగు చేసుకునేందుకు సకాలంలో నీరందించాలని మేము కట్టుబడి ఉన్నాం. అందులో భాగంగానే నేడు పురుషోత్తపట్నం తొర్రిగడ్డ పంపింగ్ స్కీము ద్వారా నీటిని విడుదల చేయడం జరిగింది. పసిడి పంటలు పండించే మన రైతన్నల ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుడ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, తెలుగు రైతు రాజానగరం నియోజకవర్గ అధ్యక్షుడు పుప్పాల వెంకటరత్నం, అడపా వీరబాబు, అడపా శ్రీనివాస్, ముక్కా రాంబాబు , వేగిశెట్టి రాజు జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, వీర మహిళలు, కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో అన్నదాతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వరుసగా నాలుగో వారం ప్రత్తిపాడులో ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమం..

-ప్రత్తిపాడు పీజీఆర్ఎస్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్
ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ..
-ప్రత్తిపాడు పీజీఆర్ఎస్ కు 68 అర్జీలు..



ప్రత్తిపాడు (జిఎస్ బి వార్త) : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో వరుసగా నాలుగో వారం శుక్రవారం నియోజకవర్గ పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యక అధికారి ఏ.శ్రీనివాసరావు, పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణారావు, తదితరులతో కలిసి హాజరై, ప్రత్తిపాడు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, సధరం సర్టిఫికెట్, భూ రికార్డులు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, పంట నష్టం, సీసీ రోడ్లు, డ్రైన్స్, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం, స్మశాన వాటికల్లో షెడ్ ఏర్పాటు, విద్యుత్తు వంటి అంశాలపై మొత్తం 68 అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు సూచిస్తూ నిర్దిష్ట సమయంలోపు తగిన పరిష్కారాల అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గత మూడు వారాలలో నమోదైన అర్జీలు పరిష్కార పురోగతిని జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించి, వివరాలు అడిగి తెలుసుకున్నార ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండ జిల్లాలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గత నాలుగు వారాలుగా ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలను నేరుగా అధికారుల సమక్షంలో తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నేడు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దాదాపు 68 అర్జీలు స్వీకరించడం జరిగిందని, గత మూడు వారాల్లో సుమారు 305, గత నెలలో మొత్తం 374 అర్జీలు వచ్చినట్టు ఆయన వివరించారు. వీటిలో ప్రధానంగా పెన్షన్లు, భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నాయి. వచ్చిన అన్ని వినతులను రాబోయే 15 రోజుల్లోగా సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, బాధితులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పెన్షన్ సంబంధిత సమస్యలు గతంలో నిలిచిపోయిన వాటిని తనిఖీ చేసి తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూ సమస్యల విషయంలో ప్రధానంగా రీ-సర్వే సమయంలో వచ్చే విస్తీర్ణంలో వ్యత్యాసంపై సమస్యలను పరిష్కరించేందుకు సర్వేయర్లను పంపి, రైతుల సమక్షంలో భూమిని కొలిచి, వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్య ప్రభ, ఎంపీడీవవో కుమార్ బాబు, ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని, జీవన విధానాన్ని నిర్ణయిస్తుంది

డా అడ్డాల, డా శ్రీమన్నారాయణ




కాకినాడ, (జిఎస్ బి వార్త ) స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో అకడమిక్ డైరక్టర్ డా బి ఇ వి ఎల్ ఎన్ నాయుడు అద్యక్షతన విద్యార్థులకు " ఏమి తినాలి, ఎలా తినాలి " అనే ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రి నుంచి వచ్చిన గేస్ట్రోఎంట్రాలజిస్ట్ డా వై శ్రీమన్నారాయణ మాట్లాడుతూ "మన జీవన విధానంలో "ఏమి తినాలి" అనే విషయంతో పాటు "ఎలా తినాలి" అనేది కూడా చాలా ముఖ్యమని , మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందాలంటే దంపుడు బియ్యం, జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు వంటి పీచుపదార్థాలు ఎక్కువ ఉన్నవి ఎంచుకోవాలి, సీజన్‌ను బట్టి దొరికే తాజా కూరగాయలు, ఆకుకూరలు రోజూ భోజనంలో భాగం కావాలని, శరీర పుష్టికి కందిపప్పు, పెసరపప్పు, శనగలు, మినుములు లేదా మొలకెత్తిన గింజలు తీసుకోవాలని, రోజుకు కనీసం ఒక తాజా పండైనా (జామ, ఆపిల్, బొప్పాయి, అరటి వంటివి) తినడం మంచిదని, పాలు, పెరుగు లేదా మజ్జిగ, నెయ్యి మరియు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని, మైదా, వైట్ షుగర్ వంటివి శరీరానికి ఎలాంటి పోషకాలను ఇవ్వవు, పైగా బరువును, షుగర్‌ను పెంచుతాయని, చిప్స్, ప్యాకెట్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్స్.నూనెలో బాగా వేయించిన కూరలు, జంక్ ఫుడ్‌ను మానేయాలని, వంటల్లో ఉప్పు, కారం, నూనెలను పరిమితంగా వాడటం మరియు రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని , ఎల్లప్పుడూ ఇంట్లో వండిన తాజా ఆహారానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. దంత వైద్యులు డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "భోజనం చేసేటప్పుడు టీవీలు, మొబైల్స్ చూడటం లేదా కోపంగా, ఆందోళనగా ఉండటం మంచిది కాదని , ఆహారంపైనే దృష్టి పెట్టి తినాలని, నోట్లోనే ఆహారం లాలాజలంతో బాగా కలవాలని ,ఇది జీర్ణక్రియను 50% సులభతరం చేస్తుందని, సుఖాసనంలో కూర్చుని తినడం చాలా మంచిదని, . దీనివల్ల జీర్ణాశయానికి రక్తప్రసరణ బాగా జరుగుతుందని, కడుపులో సగం వంతు ఆహారానికి, పావు వంతు నీటికి, మిగతా పావు వంతు గాలి ఆడేలా ఖాళీగా ఉంచాలని, ప్రతిరోజూ ఒకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలని , రాత్రి భోజనం పడుకోవడానికి కనీసం 2 గంటల ముందే ముగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ తేజేశ్వరరావు, శివ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ మునికూడలి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### ఆదర్శ గ్రామం, మోడల్ ఘాట్ అభివృద్ధి పనులను పరిశీలించనున్న ఉప ముఖ్యమంత్రి

### ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో సమీక్షించిన జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, జూలై 3** : జూలై నెల 6వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మునికూడలి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మునికూడలి ఘాట్‌ను పంచాయతీలలో మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ సూచించారు. ఉప ముఖ్యమంత్రి గ్రామానికి చేరుకున్న అనంతరం మునికూడలి ఆర్చ్ వద్ద ఘన స్వాగతం పలికి, అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వయం సమృద్ధి బస్ షెల్టర్ నమూనాను పరిశీలిస్తారు. పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు మార్గాలపై రూపొందించిన కార్యాచరణను అధికారులు వివరిస్తారు. అలాగే పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్), గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), పంచాయతీరాజ్, డీడబ్ల్యూఎంఏ శాఖలు చేపట్టిన, ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అలంకరణ వీధి విద్యుద్దీపాల నమూనాతో పాటు మ్యాజిక్ డ్రెయిన్ వ్యవస్థ, సీసీ డ్రెయిన్ నుంచి మ్యాజిక్ డ్రెయిన్‌కు అనుసంధానం, వ్యక్తిగత మరియు సామూహిక ఇంకుడు గుంతలు, జీరో డిశ్చార్జ్ వ్యవస్థ వంటి వినూత్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలిస్తారనీ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. మునికూడలి ఘాట్ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, యాత్రికులకు కల్పించనున్న సౌకర్యాల లేఔట్‌ను పరిశీలించనున్నారు. అలాగే నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన ఘాట్ విస్తరణ పనులు, ఘాట్‌ను 80 మీటర్ల పొడవుకు విస్తరించే ప్రణాళికపై అధికారులు వివరాలు అందజేస్తారు. ఘాట్ చారిత్రక విశిష్టతను వివరించడంతో పాటు, ఏపీఈపీడీసీఎల్ చేపట్టిన విద్యుత్ సంబంధిత పనులపై కూడా అధికారులు వివరిస్తారు. అనంతరం మునికూడలి ఘాట్ లోగోను ఆవిష్కరించి, అవసరమైతే అక్కడ ఏర్పాటు చేసిన ఆడియో -- విజువల్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తారు. పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్శన కార్యక్రమంలో పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. శివరాముడు, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు, పీఆర్ ఎస్ఈ కె. బాలకృష్ణ, ఏపీ ట్రాన్స్‌కో కె. తిలక్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వి. శాంతమణి, జేడీ మత్స్య శాఖ ఎన్ నిర్మల కుమారి, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ స్టార్స్ ఆధ్వర్యంలో వస్త్ర సంచులు పంపిణీ




కాకినాడ, (జిఎస్ బి వార్త ) : రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం పురస్కరించుకుని వస్త్ర సంచులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షులు నాగేంద్ర గాంధీ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు భూమిలో కలవడానికి 100 ఏళ్ళు పడుతుందని అదే విధంగా డ్రైన్లు కూడా మూసుకుపోయి మురుగు నీరుపారుదల అడ్డుకుంటున్నాయని అన్నారు. అది గాక కాఫీ, టీ వంటివి ప్లాస్టిక్ గ్లాసులలో తాగడం వలన క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి మనమంతా పట్టుదలగా పని చేయాలని నాగేంద్ర గాంధీ పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ప్రసాద్ నాయుడు, ఓం నమశ్శివాయ, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం : ఈఆర్వో కేటీ సుధాకర్




కాకినాడ సిటీ జూలై 3 జి ఎస్ బి వార్త ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల నమోదు (ఈఆర్వో), నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ కోరారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో సుధాకర్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, తిరిగి సేకరించడం, వాటిని డిజిటలైజేషన్ చేయడం వంటి ప్రక్రియలు సమర్థవంతంగా పూర్తయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బీఎల్ఓలకు క్షేత్రస్థాయిలో సహకరించాలని కోరారు. దీనివల్ల అర్హత కలిగిన ప్రతి ఓటరుకూ ఓటు హక్కు నిర్ధారణ అవుతుందని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందే ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, మ్యాపింగ్ ప్రక్రియలను అధికారులు పూర్తి చేయాలి. క్షుణ్ణంగా పరిశీలించాలి: బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు అదే చిరునామాలో నివసిస్తున్నారా, శాశ్వతంగా వలస వెళ్లారా లేదా మరణించారా అనే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలి. ఒకే నియోజకవర్గంలో కేవలం ఇల్లు మారిన వారి వివరాలను సేకరించి, దానికి సంబంధించిన ఫారాలను పూర్తి చేయించాలి. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందే ఈ ప్రక్రియ అంతా పూర్తయితే ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందుతుందని ఈఆర్వో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఈఆర్వో, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, డీసీపీ కృష్ణారావు, ఎన్నికల విభాగం డీటీ గోవిందరాజులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ కు వినతి



కాకినాడ, (జిఎస్ బి వార్త : రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు తో శుక్రవారం ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ ని కలిసి ఉద్యోగుల డిమాండ్లపై వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ తప్పకుండా ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ గుద్దటి రామ్మోహన్ రావు, జేఏసీ సెక్రెటరీ జనరల్ కె వి వి నాగేశ్వరరావు ,జిల్లా జే ఏ సి వైస్ చైర్మన్ మూర్తి బాబు ,జిల్లా జేఏసీ వైస్ చైర్మన్ చింతాడ ప్రదీప్ కుమార్,పోతు రామకృష్ణ, కే ఎం కే మూర్తి,ఎన్జీవో జిల్లా నాయకులు సరళ చంద్రరావు, బి ..వి . చౌదరి, మొండి రవికుమార్,కాకినాడ ఎన్జీవో అధ్యక్షులు సతీష్, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 7న రాజమండ్రిలో జాబ్ మేళా..!

గోకవరం జూలై 3 జి ఎస్ బివార్త : రాజమండ్రిలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జూలై 7వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీలు పాల్గొని పోస్టుల భర్తీ కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. ఇంటర్ నుంచి ఏదైనా డిగ్రీ, 19-32 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.




## సోషల్ మురళి సేవకు సత్కారం



ఏలూరు స్థానిక దక్షిణపు వీధిలో కూనిశెట్టి మురళి కృష్ణ (సోషల్ సర్వీస్ మురళీ)సౌజన్యంతో పవన్ కళ్యాణ్ వారి ఆశయాల మేరకు జనసేన పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు సేవలో భాగంగా సంక్షేమ పథకాలు నిర్వహిస్తున్న సోషల్ సర్వీస్ మురళి కృష్ణను గర్ల్స్ హై స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.దీనిలో భాగంగా సమాజ సేవకు మురళి చేస్తున్న పలు కార్యక్రమాలు క్యాన్సర్ పేషెంట్ చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఐదు వేలు ఆర్థిక సహాయం,ఒక విద్యార్థినికి కాలేజీ ఫీజు నిమిత్తం మరో 5000 రూపాయలు,నెల రోజులుగా ఆసుపత్రి పాలైన పేషెంట్ కు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు నిమిత్తం ఐదు వేల రూపాయలను,30 మంది కి ఐదు కేజీలు బియ్యం పంపిణీ,జనసేన కమిటీ మెంబర్స్ 20 మందికి,వృద్ధులకు పది మందికి చీరలు పంపిణీ,పెట్టుబడి నాది - లాభం మీది అనే కార్యక్రమంలో 12 మంది సభ్యులు గల ఒక్కొక్క గ్రూపుకు 60,000/- రూపాయలను లోను ఇవ్వడం,ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోట్స్ బుక్స్ పంపిణీ,వేసవికాలంలో నగరంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడం,గత 23 సంవత్సరాలుగా వి.ఆర్ సేవాదళ్ సంఘం సభ్యులచే జిల్లాలో విశిష్ట సేవలను అందించిన సోషల్ సర్వీస్ మురళీకృష్ణను దుశ్యాలువాతో పూలదండలు వేసి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గరల్స్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ సేవ మూర్తులను సన్మానించడం తమ పూర్వజన్మ సుకృతం అని అన్నారు.ఈ నేపథ్యంలోనే మురళీకృష్ణ మాట్లాడుతూ తమ సేవలకు గుర్తింపుగా వచ్చిన అవార్డులను,సత్కారాల గురించి ఆనందం వ్యక్తం చేస్తూ,మమ్ములను గుర్తించి మాకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన యావన్మంది ప్రజానీకానికి,ప్రజా ప్రతినిధులకు,అధికారులకు,వి.ఆర్ సేవాదళ్ సభ్యులకు,కుటుంబ సభ్యులకు,తమ మిత్రులకు,జనసేన నాయకులకు,కార్యకర్తలకు,జనసేన వీర మహిళలకు,వృద్ధాశ్రమలకు,అనాధ శరణాలయం కు,పోలీస్ అధికారులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## వాటర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం అందించిన కంబాల



గోకవరం జులై 03: జి ఎస్బి వార్త : గోకవరం గ్రామంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు శుక్రవారం రూ.2 లక్షలు విరాళం అందించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులు, ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సహకారం అందించాలని గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్, కార్మికులు, సిబ్బంది, ఏప్రిల్ నెలలో కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి కోరారు. స్పందించిన ఆయన వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందిస్తానని, హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా కంబాల శ్రీనివాసరావు గత నెలలో మొదట విడతగా లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు. రెండో విడతగా శుక్రవారం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత, మరో రెండు లక్షలు రూపాయలు అందజేశారు. ఇప్పటివరకు వాటర్ ప్లాంట్ నిర్మాణానికి మొత్తం రూ. 3 లక్షలు రూపాయలు విరాళం ఇచ్చారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకు వచ్చి వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన కంబాల శ్రీనివాసరావుకి ఆర్టీసీ యాజమాన్యం, సిబ్బంది స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జి ఎస్ బి వార్త కు స్పందన

## నో అడ్మిషన్ బోర్డుపై ఉపముఖ్యమంత్రి స్పందన

యు కొత్తపల్లి జూలై 3 (జి ఎస్ బి వార్త )గత విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియేట్ లో కాకినాడ జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు.జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో, గురువారం 7వ తరగతి నుంచి ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు లేవంటూ నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు బోధన విధానాలు, బోధనేతర సిబ్బంది సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసే స్థాయికి మూలపేట ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దడానికి తోడ్పడినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఈసారి పిఠాపురం పర్యటన సందర్భంగా మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తానని ఉప ముఖ్యమంత్రి హామీఇచ్చారు.పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలసాధించిన ఫలితాల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## దేశ నిర్మాణంలో క్రైస్తవుల పాత్ర కీలకం

**- సి.వై.ఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు**

కాకినాడ(జిఎస్ బి వార్త): 'ఇండియన్ క్రిస్టియన్ డే' సందర్భంగా సి.వై.ఎఫ్ బృందం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సి.వై.ఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవ.డా. బి.హెచ్.వి మూర్తిరాజు ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా పలువురు రాజకీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి వారి సేవలకు ఆశీర్వాదాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మూర్తి రాజు మాట్లాడుతూ భారతదేశంలో క్రైస్తవుల చారిత్రక వారసత్వాన్ని గుర్తుచేయడానికన్నారు. దేశ నిర్మాణంలో క్రైస్తవ సమాజం చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. ప్రేమ, శాంతి, సామరస్యం, సేవా భావాన్ని ప్రోత్సహించడంతో పాటు అన్ని మతాల మధ్య సోదరభావం, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా చర్చిలు, క్రైస్తవ సంఘాలు, సేవా సంస్థలు ప్రత్యేక ప్రార్థనలు, రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, కుటుంబాల పరామర్శ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ "లివింగ్ గాడ్ లివింగ్ పీపుల్"అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సి.వై.ఎఫ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రెవ. జాన్ వీక్లీఫ్, రెవ. సునీల్, రెవ. సి.కె. సింగ్, రెవ. నాని, బ్రదర్ మచ్చా బుజ్జిబాబు, జర్నలిస్ట్ నానాజీ, లోకేష్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ లో విద్యా విజయోత్సవం




అమలాపురం, జూలై 3:(జిఎస్ బి వార్త) : ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైన తొలిమెట్టని. ఈ దశలో సరైన మార్గదర్శకత్వం అందిస్తే దేశానికి అద్భుతమైన మానవ వనరులను అందించవచ్చునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.పదో తరగతి ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సందర్భంగా, జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవ నంలో విద్యా విజయో త్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరిం చారు.జోన్ పరిధిలోని 8 జిల్లాలలో కోన సీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందనలను అందుకోవడం సంతోషదా యకమన్నారు.?మొత్తం హాజ రైన విద్యార్థులు: 19,138 కాగా ఉత్తీర్ణత సాధించిన వారు 18,343 మంది అని, మొత్తం ఉత్తీర్ణత శాతం: 95.85% నమోదు కాబడి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు బాలికల ఉత్తీర్ణతలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం శతశాతం ఉత్తీర్ణత సాధిం చిందన్నారు. పచ్చని కోనసీమలో విద్యా కుసుమాలు విరబూయడంలో విద్యాశాఖ, ఉపాధ్యాయు ల అంకితభావం అభినందనీ యమన్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైన తొలి మెట్టని. ఈ దశలో సరైన మార్గదర్శకత్వం అందిస్తే దేశా నికి అద్భుతమైన మానవ వనరులను అందించవచ్చున న్నారు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచేందుకు జిల్లాలో ఇప్పటికే కెరీర్ కౌన్సిలింగ్ ప్రారంభించా మనారు. విద్య, వైద్య రంగాలకు మానవీయ కోణం ఎంతో అవసరమన్నారు. ప్రతిభా వంతులైన విద్యార్థులు తమ ప్రతిస్పందనను తెలు పుతూ ?జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడానికి తమవిజ యానికి ఉపాధ్యా యుల నిరంతర కృషి, ప్రత్యేక స్టడీ మెటీరియల్స్ మరియు సరైన మార్గదర్శ కత్వమే కారణమని తెలిపారు.?అల్లవరం మండలం సామంత కుర్రు జడ్పీ హెచ్ఎస్ కు చెందిన శిరిగినీడి రిషిత లక్ష్మీ నిహారిక 596 మార్కులు, అమలాపురం మండలం బండారులంక జడ్పీహె చ్ఎస్ కు చెందిన?చింత పట్ల జ్యోతిశ్రీ 593 మార్కులు, రామచం ద్రపురం మండలం ద్రాక్షారామం జడ్పీహెచ్ఎస్ స్కూల్ చెందిన కోన అభిశ్రీ 593 మార్కులు సాధించిన విద్యా ర్థినిలకు ?ఘన సత్కారం ల భించింది. అదేవిధంగా ?పదో తరగతిలో అత్యుత్తమ మా ర్కులు సాధించిన విద్యా ర్థులను, శత శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీవై ఈఓలను మరియు మండల విద్యాశాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఆర్‌జేడీ జి. నాగమణి, డీఈఓ పి. నాగేశ్వరరావుల చేతుల మీదుగా దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో పీ 4 మార్గదర్శి చెరుకూరి సాయిరామ్, ఓ ఎన్ జి సి ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ ఈడీ ప్రభాల్‌సేన్ గుప్తా, ఈస్ట్‌కోస్ట్ రవ్వ ప్రాజెక్ట్ హెడ్ సౌమెన్ దేవ్, జిల్లా రవాణా శాఖ అధికారి డి. శ్రీనివాస్, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అశోక్ నాగరాజన్, ప్రభుత్వ పరీక్షల విభాగం ఏసీ బి. హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీ వీ ఎస్ సుబ్రహ్మణ్యం సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు

## గోదావరి ఏటిగట్ల పటిష్టతకు సిఎస్ఐ ఆర్-ఎన్ఐఓ ద్వారా సమగ్ర ప్రతిపాదనలు:

**కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్:**




అమలాపురం జూలై 03:(జిఎస్ బి వార్త) : బలహీనపడిన గోదావరి నది ఏటిగట్లను శాశ్వత ప్రాతిపదికన పటిష్టపర చడానికి సిఎస్ఐఆర్ - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రతినిధులతో కలిసి సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమా ర్ వెల్లడించారు.?శుక్రవారం కలెక్టరేట్ నుండి సిఎస్ఐ ఆర్-ఎన్ఐఓ ప్రతినిధులు డాక్టర్ వినీత్, సైంటిస్టులు జయ కుమార్, సేలంలతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశా న్ని నిర్వహించారు.?ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కుండలేశ్వరం వద్ద గోదా వరి తీరం వెంబడి ఏటిగట్టు కిందకు దిగిపోయిన కుంగి పోయినఘటనను తీవ్రంగా పరిగణించామన్నారు. ఇటువంటి బలహీనమైన, ప్రమాదకరమైన ప్రాంతాల ను రక్షించడానికి శాస్త్రీయ విధానాలు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యం లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణు లు, గోదావరి హెడ్ వర్క్స్ జలవనరుల శాఖ ఇంజనీ ర్లు కలిసి క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పర్యటించా లని ఆదేశించారు. గోదా వరి తీరప్రాంత పొడవునా ఎక్కడెక్కడ ఏటిగట్లు బలహీనపడ్డాయో క్షు ణ్ణంగా గుర్తించి, వాటి పునరుద్ధరణకు ప్రాథమిక నివేదిక, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచిం చారు.?ఈ ప్రతిపాదనల ఆధారంగా డాక్టర్ ఎం.ఎస్. శ్రీవత్స, సంస్థ సీఈఓ కిరణ్ పమిడిపాటి సాంకేతిక అం చనాలను త్వరితగతిన రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. భవిష్యత్తు లో నదీ తీర ప్రాంతాల్లో సంభవించే విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు, ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నుండి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలవన రుల శాఖ పర్యవేక్షకు ఇంజనీర్ జి శ్రీనివాసరావు, వారి సహచర ఇంజనీర్లు జిల్లా జిల్లా డ్రైనేజీ విభాగం కార్య నిర్వాహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్ శాస్త్రవే త్తులు, ఇతర ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.



Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.